
PRGI TGTEL/26/A7432

ప్రభాత శ్రీ
# సిటీటైమ్స్
తెలుగు దినపత్రిక

Hyderabad | Adilabad | Rangareddy | Nalgonda | Medak | Mahaboobnagar | Karimnagar | Warangal | Khammam | Nizamabad

సంపుటి - 01 | సంచిక - 10 | హైదరాబాద్ | బుధవారం | తేదీ:09.09.2026 | పేజీలు 08 | వెల రూ.3 | epaper.citytimesdaily.com

## అధికారులు రాజ్యాంగానికే కట్టుబడి ఉండాలి




2లో..

## మోదీ సభలో కలకలం
## నకిలీ పీఎంవో ఐడీ కార్డులు



2లో..

# అసత్యాలపై సత్యమే గెలుస్తుంది

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- యువతే దేశ భవిష్యత్తు: మోదీ
- విపక్షాల అబద్ధాలపై విమర్శలు
- రాహుల్ ఛాంత్రో కీ గూంజ్‌పై చురకలు
- ఫైట్ కారిడార్‌పై కాంగ్రెస్‌ను టార్గెట్
- ఏఐ నైపుణ్యాలు పెంచుకోవాలని పిలుపు

2లో..



**ముంబై, సిటీటైమ్స్**

అసత్యాల ప్రతిధ్వనిని సత్యం జయిస్తుందని ప్రధాని మోదీ తాజాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. అసత్యాల ప్రతిధ్వనుల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కానీ భారత దేశ యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోందని చెప్పారు. తప్పుదారి పట్టించే వారు ప్రతి చోటా తారసపడుతూనే ఉంటారని అన్నారు. అంతకుముందు ప్రధాని వడోదరలో రూ.20 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

## భారత సరిహద్దుల వెలుపల అరుణాచల్, అక్సాయ్ చిన్

- ఐరాస కొత్త మ్యాప్ వివాదం
- ఆఫ్రికా ఖండాన్ని పెద్దదిగానూ..
- ఉత్తర అమెరికాను చిన్నదిగా చూపడంపై..
- అమెరికా తీవ్ర అభ్యంతరం


8లో..




## మైక్ ఇస్తే క్షమాపణ చెబుతారనుకున్నా

- హరీశ్ రావుపై స్పీకర్ అసహనం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చర్యల హెచ్చరిక
- పోలీసులపై దాడులపై సీరియస్
- కేసీఆర్‌కు స్వయంగా ఫోన్ చేశా

8లో..



# కేటీఆర్ అరెస్ట్

- బోయిన్‌పల్లి పీఎస్ వద్ద రణరంగం
- రాళ్లు, కుర్చీలతో హంగామా
- బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల పరస్పర దాడులు
- నినాదాలు, వాగ్వాదం, తోపులాట
- పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్తత
- రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు..
- పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు
- అదనపు బలగాలను రంగంలోకి..



**హైదరాబాద్, సిటీటైమ్స్**

హైదరాబాద్ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావుతో పాటు పలువురు ఆ పార్టీ ముఖ్య నేతలను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తీవ్ర ఆందోళన చేపట్టారు. ఇదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొద్దిసేపటికి వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది.

పరిస్థితి అదుపు తప్పడంతో కొందరు కార్యకర్తలు కుర్చీలు, రాళ్లు విసురుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళన కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ కార్యకర్తలు ముందుకు రావడంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

8లో..




## 1000 రోజులు.. హామీలు ఎక్కడ?

- హరీశ్ రావు బిగ్ కౌంటర్!
- డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఫైర్
- ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయంటూ ప్రశ్న
- రైతులు, నిరుద్యోగుల సమస్యలపై విమర్శలు

**హైదరాబాద్, సిటీటైమ్స్**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగకుండా ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

8లో..

## ఖర్గే ర్యాలీ తర్వాత శుద్ధి చేసిన ఘటనపై ఎఫ్ఐఆర్

- ఫలించిన కాంగ్రెస్ పోరాటం
- ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో ఘటన

2లో..



## కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంపై
# దాడికి రేవంత్ రెడ్డి కుట్ర

- మాజీ మంత్రి కేటీఆర్ సంచలన ఆరోపణ

2లో..

- హామీల వైఫల్యంపై నిలదీస్తే అడ్డగింతలా?
- మొదటి రోజే సభకు రానివ్వలేదు
- సీఎం రేవంత్ రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్



**ఎర్రవల్లి, సిటీటైమ్స్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంపై పోలీసుల సహకారంతో దాడికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఆరోపించింది. కాంగ్రెస్ శాసనసభ్యుల నేతృత్వంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎర్రవెల్లికి చేరుకోవడంతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నాయకులు హరీష్ రావు, ఎమ్మెల్యేలు, నాయకులు ఎర్రవెల్లికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు.

## అర్హతలు లేని వారిని తొలగించాలి

### టెట్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

2లో..

### ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టాల అమలుకు ఆదేశం

**హైదరాబాద్, సిటీటైమ్స్**

టీచర్ నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉపాధ్యాయుల నియామకాలు, ఉద్యోగంలో కొనసాగింపుపై సంచలన ఆదేశాలు ఇచ్చింది. ఇకపై ఆర్ టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీచట్టాల ప్రకారం నిర్దేశించిన అర్హతలు లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించకూడదని.. అలాగే ఉద్యోగంలో కొనసాగించకూడదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఉపాధ్యాయులు, విద్యా సంస్థల ఉద్యోగుల ప్రావిన్షియలైజేషన్‌కు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL)పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది.

## పోలీస్ ఉద్యోగాల దరఖాస్తు
# గడువు పొడిగింపు

- 16వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు
- దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు
- తొలుత సెప్టెంబర్ 9వ తేదీ డెడ్‌లైన్

8లో..

**హైదరాబాద్, సిటీటైమ్స్**

తెలంగాణ రాష్ట్రంలో
పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న వేలాది మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల విజ్ఞప్తులు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు

- ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు బిగ్ షాక్
- మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టగా..
- మూజువాణి పద్ధతిలో ఓటింగ్
- అనంతరం సస్పెన్షన్ నిర్ణయం

2లో..



సిటీ టైమ్స్
తెలుగు దినపత్రిక
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com


# ఖర్గే ర్యాలీ తర్వాత శుద్ధి చేసిన ఘటనపై ఎఫ్ఐఆర్

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

ఎట్టకేలకు కాంగ్రెస్ పోరాటం ఫలించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ర్యాలీ తర్వాత ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో శుద్ధి చేశారన్న ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారంపై రాజ్యసభలో కూడా ఖర్గే ప్రస్తావించారు. ఇక లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా తీవ్రంగా తప్పుపట్టారు. వెంటనే ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని డిమాండ్ చేశారు. మొత్తానికి ఇన్ని రోజుల తర్వాత పోలీసులు కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ర్యాలీ అనంతరం హల్ద్వానీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగినట్లు ఆరోపించబడిన ఒక శుద్ధీకరణ కార్యక్రమానికి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైంది. న్యాయవాది అంజు దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా హల్ద్వానీ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిపై కుల వివక్ష, సామాజిక అవమానం, ద్వేషాన్ని, న్యూనతా భావాన్ని రెచ్చగొట్టడం వంటి ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీలోని సెక్షన్లు 196, 299, 3(1)ఆర్, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ఈ కేసు నమోదు చేశారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, డాక్టర్ జగదీష్ చంద్ర, ఈ మొత్తం వ్యవహారాన్ని దర్యాప్తు చేయనున్నారు.

ఇదిలా ఉండగా 'శుద్ధీకరణ' కేసు విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ షెడ్యూల్డ్ కులాల ఫ్రంట్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రాష్ట్రవ్యాప్త నిరసన చేపట్టింది. అయితే ఈ విషయమై పోలీసులు ఇప్పుడు కేసు నమోదు చేశారు.

## కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంపై దాడికి రేవంత్ రెడ్డి కుట్ర

**ఎర్రవల్లి, సిటీటైమ్స్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంపై పోలీసుల సహకారంతో దాడికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఆరోపించింది. కాంగ్రెస్ శాసనసభ్యుల నేతృత్వంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎర్రవెల్లికి చేరుకోవడంతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నాయకులు హరీష్ రావు, ఎమ్మెల్యేలు, నాయకులు ఎర్రవెల్లికి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు.

దీంతో ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి కాలి నడకన వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సహా ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేశారు. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ క్రమంలో హైడ్రామా నెలకొంది. ఈ ప్రణాళికలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ శాసనసభ్యులు, పోలీసు అధికారులపై కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

కేటీఆర్, ఇతర ఎమ్మెల్యేలు బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఉన్నారనే సమాచారంతో కాంగ్రెస్ శ్రేణులు భారీగా అక్కడికి చేరుకునేందుకు ప్రయత్నించాయి. అయితే అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని తీవ్రంగా నిలదీసి, అక్కడి నుండి తరిమికొట్టడంతో వాతావరణం కాసేపు రణరంగాన్ని తలపించింది.

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఎంతమందిని అరెస్టూ చేసినా, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ శ్రేణులు భయపడేది లేదని, ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడతాయని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి దళితులపై నిజంగా ప్రేమ ఉంటే, ఎన్నికల సమయంలో ఇచ్చిన దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధకుడు కేసీఆర్‌పై కుట్రలు చేస్తూ దిగజారుడు రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమయంలో తెలంగాణ సమాజం బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలెవరూ ధైర్యం కోల్పోవద్దని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మరోవైపు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద అంతకుముందు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి. జగదీష్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రెచ్చగొట్టి కేసీఆర్ నివాసానికి చేరేలా చేసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాంతిభద్రతల సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిపై దాడికి కుట్ర పన్నుతున్నారని, గూండాలను, రౌడీలను పంపుతున్నారని ఆరోపించారు.

భూ భారతి చట్టం కింద ప్రభుత్వ భూములను దుర్వినియోగం చేశారన్న ఆరోపణల వంటి సమస్యలను లేవనెత్తకుండా ఆపేందుకు, బీఆర్ఎస్ శాసనసభ్యులను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కేసీఆర్‌ను రక్షించడానికి ఎర్రవెల్లికి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని, పార్టీ కార్యకర్తలను అరెస్టు చేశారని కూడా ఆయన ఆరోపించారు.

## సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు

**హైదరాబాద్, సిటీటైమ్స్**

తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు.

ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు.

స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది.

అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# అధికారులు రాజ్యాంగానికే కట్టుబడి ఉండాలి

- రాజకీయ నేతలకు కాదు..
- విద్యార్థిని అరెస్ట్‌పై హైకోర్టు సంచలన తీర్పు
- ఏప్రిల్‌లో నోయిడా కార్మికుల నిరసన వ్యవహారం



**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని , సామాజిక కార్యకర్త ఆకృతి చౌదరిపై మోపిన జాతీయ భద్రతా చట్టం నిర్బంధాన్ని రద్దు చేస్తూ.. దానికి గల స్పష్టమైన కారణాలతో అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే అధికారులు ఉత్తరప్రదేశ్‌ను 'అణచివేత రాజ్యంగా' మార్చే ప్రమాదం ఉందని కోర్టు హెచ్చరించింది. అంతేకాదు, అధికారులు తమ ప్రాథమిక విధేయత రాజ్యాంగానికే చూపించాలని, రాజకీయ నాయకులకు కాదని ఘాటుగా స్పందించింది.

సెప్టెంబరు 2న ఆకృతి చౌదరిపై మోపిన ఎన్ఎస్ఏ నిరోధక నిర్బంధాన్ని రద్దు చేస్తూ.. ఆమెకు రూ. 5 లక్షల పరిహారం మంజూరు చేసిన తీర్పు కాపీని హైకోర్టు విడుదల చేసింది. సరైన ఆధారాలు లేకుండా ఒక విద్యార్థి నాయకురాలిపై కఠినమైన జాతీయ భద్రతా చట్టాన్ని ఉపయోగించినందుకు గౌతమ్ బుద్ధ నగర్ పరిపాలనా యంత్రాంగం, పోలీసులపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ అతుల్ శ్రీధరన్, జస్టిస్ అచల్ సచ్‌దేవ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం.. పౌరుల రాజ్యాంగ హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమాన్ని పరిరక్షించే బాధ్యత ఉంది కాబట్టే అధికారులు, పోలీసులకు అపరిమితమైన అధికారాలు ఇచ్చారని పేర్కొంది. ''ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ విధేయత రాజ్యాంగానికి మాత్రమే ఉండాలని, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులకు కాదని గుర్తుంచుకోవాలి'' అని వ్యాఖ్యానించింది. ''తమ రాజ్యాంగ ప్రమాణాన్ని అధికారులు విస్మరించినప్పుడు.. వారు 'బ్రిటిష్ సామ్రాజ్యపు అణచివేత ఆనవాళ్లుగా' మారే ప్రమాదం ఉంది.. 'బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారుల వల్ల ఉత్తరప్రదేశ్ త్వరలోనే దుష్ట రాజ్యంగా మారుతుంది'' అని ధర్మాసనం తీవ్రంగా హెచ్చరించింది.

ఈ ఎన్ఎస్ఏ నిర్బంధానికి ఆమోదం తెలిపిన గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్ మేధా రూపమ్ పనితీరుపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పోలీసు నివేదికల్లో కేవలం ఆరోపణలు మాత్రమే ఉండి, ఎలాంటి బలమైన ఆధారాలు లేనప్పుడు, ఎన్ఎస్ఏ వంటి అతిపెద్ద అధికారాన్ని ఉపయోగించే ముందు కలెక్టర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ''ఈ వివాదాస్పద ఉత్తర్వులను జారీ చేసిన గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్ ప్రవర్తన ఆమోదయోగ్యం కానిది, హేయమైనది'' అని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది.

ఈ ఏడాది ప్రారంభంలో నొయిడాలో జరిగిన కార్మిక నిరసనల అనంతరం ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని ఆకృతి చౌదరిపై కేసు నమోదైంది. ప్రభుత్వం సమర్పించిన వాట్సాప్ చాట్లు, వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన కోర్టు.. ఆమె హింసను, అల్లర్లను, ఆస్తుల విధ్వంసాన్ని ప్రోత్సహించినట్లు చూపే ఏ ఒక్క ఆధారమైనా ఉందా? అని ప్రశ్నించింది. దానికి తగిన ఆధారాలు చూపడంలో ప్రభుత్వం విఫలమైంది.

ప్రభుత్వం చూపించిన వీడియోల్లో ప్రజలు కేవలం మెరుగైన వేతనాలు, మానవీయ పని వాతావరణం కోసం శాంతియుతంగా సమకూరినట్లు మాత్రమే ఉందని కోర్టు గుర్తించింది. ఆకృతి చౌదరికి ఎలాంటి నేరచరిత్ర లేదని, ఆమె హింసను ప్రోత్సహించినట్లు రికార్డుల్లో ఎక్కడా లేదని తెలిపింది. కార్మికులకు మద్దతుగా ఇతరులు తమ రాజ్యాంగబద్ధమైన భావ ప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించకుండా భయపెట్టేందుకు, ఆకృతి చౌదరిని ఒక ఉదాహరణగా చూపించి భయాందోళనలు సృష్టించేందుకు యత్నించినట్లు పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది.

ఆకృతి అరెస్టు విషయంలోనూ ప్రభుత్వ వాదనల్లో లోపాలను కోర్టు ఎత్తిచూపింది. ఏప్రిల్ 11న బొటానికల్ గార్డెన్ మెట్రో స్టేషన్ నుంచి తనను తీసుకెళ్లారని ఆమె చెప్పగా, ఏప్రిల్ 12న అరెస్టు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. రికార్డులను పరిశీలించిన కోర్టు, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 130 కింద జారీ చేసిన నోటీసు ఆమె అరెస్టు తర్వాతే తయారు చేసినట్లు తేల్చి, ఈ ప్రక్రియ అంతా ఒక 'డ్రామా' అని అభివర్ణించింది.

సాధారణ నేర చట్టాలకు ప్రత్యామ్నాయంగా ఎన్ఎస్ఏ కింద నిర్బంధించకూడదని బెంచ్ స్పష్టం చేసింది. ఈ కేసులోని ఆధారాలు కేవలం 'అనుమానాలు, అభిప్రాయాల ఆధారంగా తయారుచేసినవి' తప్ప అసలైన సాక్ష్యాధారాలు లేవని తేల్చిచెప్పింది. ''వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ఇటువంటి అత్యవసర అధికారాలను ఊహాగానాలు, పక్షపాతాలు, అభిప్రాయాల ఆధారంగా ఉపయోగించకూడదు'' అని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది.

# మోదీ సభలో కలకలం నకిలీ పీఎంవో ఐడీ కార్డులు

- తుపాకీతో ప్రవేశించిన ఇద్దరు
- అదుపులోకి తీసుకున్న అధికారులు
- పోలీసులు వారికి క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగింత






**ముంబై, సిటీటైమ్స్**

ముంబయిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనాల్సిన ఒక కార్యక్రమం ప్రాంగణంలో తుపాకీ, నకిలీ పీఎంఓ (ప్రధానమంత్రి కార్యాలయం) ఐడీ కార్డులతో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముంబయి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ ఘటన తీవ్ర భద్రతా ఆందోళనను రేకెత్తించింది. అదుపులోకి తీసుకున్న వారి వివరాలను వెల్లడించిన ముంబయి పోలీసులు.. వారి వద్ద నుంచి ఒక తుపాకీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న 'నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్' వద్ద ప్రధాని మోదీ కార్యక్రమం జరగాల్సిన ప్రదేశంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండటం పోలీసులు గమనించారు.

వెంటనే పోలీసులు ఆ వ్యక్తిని, తుపాకీతో ఉన్న అతని బాడీగార్డ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆ వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. తాను ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన అధికారిగా చెప్పుకున్నప్పటికీ, తనిఖీ చేయగా అతడి వద్ద నకిలీ పీఎంఓ ఐడీ కార్డు ఉన్నట్లు తేలింది. ప్రధాని రాకకు కొద్ది గంటల ముందు ఈ అరెస్టులు జరగడంతో అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం సాయంత్రం వేదికగా జరిగే 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్'ను ప్రారంభించడానికి ప్రధాని మోదీ రావాల్సి ఉంది.

నకిలీ ఐడీలు, తుపాకీతో ఈ సభ ప్రాంగణంలోకి ఎందుకు వెళ్లారనే గల కారణాలను తెలుసుకునేందుకు ముంబయి పోలీసులు ప్రస్తుతం వారిద్దరినీ సుదీర్ఘంగా విచారిస్తున్నారు. ఈ ఘటన తీవ్రతను దృష్ట్యా క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తును ప్రారంభించింది. అదుపులోకి తీసుకున్న ఇద్దరు వ్యక్తులను ప్రశ్నించడంతో పాటు వారి మొబైల్ ఫోన్లు, ఐడెంటిటీ కార్డులు, ఇతర వస్తువులను పరిశీలిస్తున్నారు. విచారణలో నిజా నిజాలు వెలుగులోకి వచ్చిన తర్వాత వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# అసత్యాలపై సత్యమే గెలుస్తుంది

**ముంబై, సిటీటైమ్స్**

అసత్యాల ప్రతిధ్వనిని సత్యం జయిస్తుందని ప్రధాని మోదీ తాజాగా వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు. అసత్యాల ప్రతిధ్వనుల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కానీ భారత దేశ యువత మాత్రం సత్యమార్గంలో ప్రయాణిస్తోందని చెప్పారు. తప్పుదారి పట్టించే వారు ప్రతి చోటా తారసపడుతూనే ఉంటారని అన్నారు. అంతకుముందు ప్రధాని వడోదరలో రూ.20 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

ఈ సభకు పెద్ద ఎత్తున హాజరైన గుజరాత్ యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'ఇటీవలే వడోదర, ముంబై మధ్య డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభమైంది. ఈ రైలు ద్వారా ఒక్క ట్రిప్‌లో 250 ట్రక్కులకు సమానమైన సరకును తరలించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కూడా కొందరు ఎంట్రీ ఇచ్చి విమర్శలు గుప్పిస్తారు. ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తారు. ట్రక్కుల పరిస్థితి ఏమిటని అంటారు. వాళ్లకు గొణిగేందుకు మరో అంశం దొరికినట్టే' అని ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. 2014కు ముందు సరకు రవాణా ప్రత్యేక కారిడార్ నిర్మాణం కిలోమీటరు మేర కూడా ముందుకు సాగలేదని విమర్శించారు.



**రాహుల్‌పై మోదీ విమర్శలు**

యువత ఆకాంక్షలు, గళం.. విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని మోదీ అన్నారు. తప్పుదోవ పట్టించాలని చూసేవారు మన ప్రయాణంలో ప్రతి మలుపు వద్దా కనిపిస్తారని, కానీ భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని చెప్పారు. దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ 'Chhatron Ki Goonj' (విద్యార్థుల ప్రతిధ్వని) పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న సంగతి తెలిసిందే. దానిని ఉద్దేశించే మోదీ విమర్శలు చేశారు. గుజరాత్ లోని వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

''దేశంలో ప్రభుత్వాల పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్ట్రర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశకూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి'' అని యూపీఏ పాలనపై మోదీ ధ్వజమెత్తారు. 10 ఏళ్లలో వారు 50వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము మాత్రం 50వేల రైలు కోచ్‌లను నిర్మించామని వెల్లడించారు. అనంతరం యువత గురించి మాట్లాడిన ప్రధాని.. ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అలాగే రూఫ్‌టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. ''ఇప్పుడు ఎన్నో కుటుంబాలు ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులుగా మారిపోయాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి'' అని పేర్కొన్నారు. ఇప్పుడు దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

**ధురంధర్ పాటతో మోదీకి స్వాగతం..**

'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మోదీ వస్తుండగా.. వేదికపైన ధురంధర్ సినిమాలోని 'Aari Aari', క్వీన్ చిత్రంలోని 'We Will Rock You' పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానిని ఘనంగా స్వాగతించారు.

# అర్హతలు లేని వారిని తొలగించాలి



**హైదరాబాద్, సిటీటైమ్స్**

టీచర్ నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉపాధ్యాయుల నియామకాలు, ఉద్యోగంలో కొనసాగింపుపై సంచలన ఆదేశాలు ఇచ్చింది. ఇకపై ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీచట్టాల ప్రకారం నిర్దేశించిన అర్హతలు లేని వారిని ఉపాధ్యాయులుగా నియమించకూడదని.. అలాగే ఉద్యోగంలో కొనసాగించకూడదని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఉపాధ్యాయులు, విద్యా సంస్థల ఉద్యోగుల ప్రొవిన్షియలైజేషన్‌కు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (PIL)పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది.

**అర్హతలు లేకుంటే టీచర్‌గా నియమించొద్దు**

ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా.. సంబంధిత చట్టాల ప్రకారం నిర్దేశించిన కనీస అర్హతలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. కింద నిర్దేశించిన అవసరమైన అర్హతలు కలిగి లేని వ్యక్తులను పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించకూడదని సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది. అంటే ఇప్పటికే ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయుల విషయంలోనూ సంబంధిత చట్టాలు, నిబంధనల్లో పేర్కొన్న అర్హతలను పాటించాల్సి ఉంటుందని కోర్టు ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులను ప్రొవిన్షియలైజేషన్ చేసే ప్రక్రియకు సంబంధించిన చట్టబద్ధ నిబంధనలు, పథకాలను సవాలు చేస్తూ ఈ PIL దాఖలైంది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలపై వారు తమ స్పందనను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. దీనిపై తదుపరి విచారణలో మరిన్ని అంశాలను పరిశీలించనున్నట్లు కోర్టు తెలిపింది.

# మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా?

- మహిళా ఎమ్మెల్యేల పట్ల అసెంబ్లీలో సీఎం వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ నిరసన
- చందానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు నల్లగంతలు కట్టుకుని మహిళల ఆందోళన




**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 8 (సిటీటైమ్స్):**

అసెంబ్లీలో సీనియర్ మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలు ఆందోళనకు దిగారు. చందానగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకురాలు బొబ్బా నవతారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా ఎమ్మెల్యేలకు, తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**మహిళా నేతల పట్ల తీరుపై ఆగ్రహం**

ఈ సందర్భంగా బొబ్బా నవతారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, సీనియర్ మహిళా నేతలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను ఉద్దేశించి అసెంబ్లీలో చులకనగా మాట్లాడటం సరికాదని అన్నారు. ఇది ఆ ఇద్దరు నేతలకు జరిగిన అవమానం మాత్రమే కాదని.. యావత్ తెలంగాణ మహిళా లోకానికి జరిగిన అవమానమని పేర్కొన్నారు. మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం సీఎం వ్యవహారశైలితో స్పష్టమైందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సహనంతో సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి.. వ్యక్తిగత విమర్శలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.

మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఎవరూ వ్యవహరించినా చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని ఆమె అన్నారు. కళ్లకు గంతలు కట్టుకుని మహిళలు చేపట్టిన నిరసనను ప్రభుత్వం గమనించాలని కోరారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలకు సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**క్షమాపణ చెప్పకపోతే.. ఉద్యమం ఉధృతం**

మహిళా నేతలను అవమానించేలా వ్యవహరించడం పట్ల ప్రభుత్వం స్పందించాలని బొబ్బా నవతారెడ్డి కోరారు. సీఎం బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే రానున్న రోజుల్లో మహిళలను ఏకతాటిపైకి తెచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, శభన, శరీన్, శోభ, రాధ తదితర మహిళలతో పాటు సీనియర్ నాయకులు కోమండ్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, సంగారెడ్డి, రాజన్న, రామకృష్ణగౌడ్, అల్లాఉద్దీన్, శివరాజ్, చందర్‌రావు, గౌస్, అంజి, శేఖర్ తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరసన పేరుతో చిల్లర ప్రదర్శనలొద్దు!

- అసెంబ్లీ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి: వి. జగదీశ్వర్‌గౌడ్
- నిరసనకు హక్కుంది.. హక్కుతో పాటు బాధ్యత, హుందాతనం ఉండాలి



**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 8 (సిటీటైమ్స్):**

అసెంబ్లీ అంటే రాజకీయ రచ్చకు వేదిక కాదని.. ప్రజా సమస్యలపై చర్చించి, పరిష్కార మార్గాలు అన్వేషించే ప్రజాస్వామ్య వేదిక అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లి పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచితంగా మాట్లాడారంటూ జరుగుతున్న నిరసనలపై ఆయన స్పందించారు. తాతా మధును పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే ఆ హక్కుతోపాటు బాధ్యత, హుందాతనం కూడా ఉండాలని జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. నల్ల టీషర్టులతో నినాదాలు చేయవద్దని పోలీసులు సూచించిన నేపథ్యంలో టీషర్టు తొలగించి కేవలం బనియన్‌తో నిరసనకు రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకులకు అసెంబ్లీలో ఎలా వ్యవహరించాలో తెలియదా అని నిలదీశారు. మహిళా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్న సభలో ఇలాంటి ప్రదర్శనలు చేయడం ద్వారా ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీని రాజకీయ రచ్చబండగా మార్చడం ప్రతిపక్ష పోరాటం కాదని, నిరసన పేరుతో చిల్లర ప్రదర్శనలు చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు తగదన్నారు.

రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ సభా గౌరవాన్ని, రాజకీయ సంస్కారాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త రఘునందన్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, సయ్యద్‌గౌస్, కాట్ల శేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు అలీ, జహంగీర్, భాష్పక యాదగిరి, నాగేశ్‌నాయక్, శేఖర్ ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, హరికిషన్, అంతిరెడ్డి, పట్వారి శశిధర్, యలమంచి ఉదయ్‌కిరణ్, గంగల గణేశ్‌యాదవ్, అయాజ్‌ఖాన్, పోచన్న, సయ్యద్‌బాబా, లక్ష్మణ్, కృష్ణ, చిన్న, కార్తిక్‌గౌడ్, నారాయణ, ప్రభాకర్, పద్మారావు, రవికుమార్ నాయీ, సుధాకర్, రాజేశ్, శంకర్‌గౌడ్, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, శామ్యూల్ కార్తిక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాకీర్, ప్రధాన కార్యదర్శి నరేందర్ ముదిరాజ్, మాజీ అధ్యక్షులు సౌందర్యరాజన్, సాజిద్, రషీద్, పరశురామ్, యాదయ్య, యాదగిరి, ఇస్మాయిల్, జావేద్, ముజీబ్, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు భాగ్యమ్మ, ఉపాధ్యక్షులు పార్వతి, జయ, అనిత, తన్వీర్‌బేగం, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు చంద్రమౌళి, రవికుమార్‌గౌడ్, కిరణ్, సాయికిశోర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను ఫైర్ ఎన్ఓసీ నుంచి మినహాయించాలి: ట్రస్మా

- ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలకు స్వీయ ధ్రువీకరణే సరిపోతుంది
- ఫైర్ శాఖ డైరెక్టర్ జనరల్‌కు ట్రస్మా ప్రతినిధి బృందం విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):**

ప్రస్తుతం నిర్వహణలో ఉన్న పాఠశాలలను ఫైర్ ఎన్ఓసీ నిబంధనల నుంచి మినహాయించాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్. రెడ్డి కోరారు. ఇప్పటికే నడుస్తున్న పాఠశాలల నిర్వాహకుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకుంటే సరిపోతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ మేరకు నానక్‌రాంగూడలోని తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్‌ను



ట్రస్మా ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. ఫైర్ ఎన్ఓసీ పొందడంలో పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాస్తవ పరిస్థితులను డైరెక్టర్ జనరల్ దృష్టికి తీసుకెళ్లారు.

నూతన నిబంధనల రూపకల్పనలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఎస్.ఎన్. రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న పాఠశాలలకు కూడా ఫైర్ ఎన్ఓసీ తప్పనిసరి చేయడం సమంజసం కాదన్నారు. పాఠశాల నిర్వాహకుల నుంచి స్వీయ ధ్రువీకరణ తీసుకోవడం ద్వారా ఈ ప్రక్రియను సరళీకృతం చేయవచ్చని సూచించారు. డే స్కాలర్ పాఠశాలలను వాణిజ్య విభాగంలో పరిగణించవద్దని, భవనాల సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపులు కల్పించాలని కోరారు. అలాగే ఫైర్ ఎన్ఓసీ ధ్రువీకరణ ఫీజులను నామమాత్రంగా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి పాఠశాలలో అగ్నిమాపక భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ట్రస్మా ప్రతినిధులు సూచించారు.

పాఠశాలలను ఇతర వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, సినిమా థియేటర్లతో పోల్చరాదని, విద్యా సంస్థల స్వభావం వాటికి భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పాఠశాలలను ప్రత్యేక విభాగంగా గుర్తించి, ఫైర్ భద్రత నిబంధనలను సరళీకృతం చేయాలని ట్రస్మా బృందం కోరింది. తమ విజ్ఞప్తులపై డైరెక్టర్ జనరల్ సానుకూలంగా స్పందించినట్లు ట్రస్మా నేతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా కార్యదర్శి కె. అనిల్ కుమార్, కోశాధికారి కె. శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేల అవమానంపై బాచుపల్లిలో బీఆర్ఎస్ నిరసన

- ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో ధర్నా

**నిజాంపేట్, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):**

**మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డికి జరిగిన అవమానంపై ముఖ్యమంత్రి బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. నిజాంపేట్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం బాచుపల్లిలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు.**

**మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన ఘటన కేవలం ఇద్దరు ప్రజాప్రతినిధులకు జరిగిన అవమానం మాత్రమే కాదని, యావత్ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రతిపక్ష సభ్యుల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని విమర్శించారు.**




**మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ ఉదయం బాచుపల్లిలో ధర్నా నిర్వహించిన అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కూడా బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.**

**ఈ సందర్భంగా రంగరాయ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ మహిళల ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు. మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానాన్ని ప్రశ్నించి, బాధ్యులు క్షమాపణ చెప్పే వరకు పోరాటం కొనసాగించాలని పేర్కొన్నారు.**

**ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కాసాని వీరేశ్, కాసాని సుధాకర్, ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, దేవి చందు ముదిరాజ్, జ్యోతి నరసింహారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు సలీం, చంద్రగిరి సతీష్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, సాంబశివరెడ్డి, మాజీ వార్డు సభ్యులు ఖాదరయ్య, మున్నా, పూజారి, వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు అర్పిత, డివిజన్ అధ్యక్షులు జస్వంత్, మధుసూదన్, ప్రదీప్, మల్లేష్, సోషల్ మీడియా కన్వీనర్ విద్యాసాగర్, యువజన నాయకులు ప్రవీణ్ గౌడ్, రాకేష్, సలీం, నవీన్, ఉద్యమకారుడు చంద్రయ్యతో పాటు బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**

# రంగారెడ్డి నగర్‌లో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



- సీఎంసీ కమిషనర్ శ్రీజన క్షేత్రస్థాయి సమీక్ష
- చింతల్ సర్కిల్ పరిధిలో 'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 8(సిటీటైమ్స్):**

ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతున్న 'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ జోన్, చింతల్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డి నగర్ వార్డులో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. సీఎంసీ కమిషనర్ శ్రీజన ఆధ్వర్యంలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ అధికారులు, వివిధ విభాగాల అధికారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని వార్డులోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ స్థానిక నివాసితులు, అసోసియేషన్ ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడి వారు ఎదుర్కొంటున్న పౌర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, శ్మశానవాటిక అభివృద్ధి, వీధి దీపాలు, బస్ షెల్టర్ల ఏర్పాటు, కమ్యూనిటీ సదుపాయాలు, ప్రజా మరుగుదొడ్లు, ట్రాఫిక్ నిర్వహణ, ఆక్రమణల తొలగింపు తదితర అంశాలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజలు లేవనెత్తిన ప్రతి సమస్యను నమోదు చేసి విభాగాల వారీగా సమీక్షించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు ప్రాధాన్యతతో చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని సకాలంలో పరిష్కారం చూపాలని సూచించారు. 'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమం ద్వారా ప్రతి రోజు ఒక వార్డును సందర్శిస్తూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత విభాగాలతో సమన్వయం ద్వారా పరిష్కరించేందుకు సీఎంసీ చర్యలు కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు.

# మహిళా ఎమ్మెల్యేల అవమానంపై మహాధర్నా



- పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఆగం రాజు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

**బాచుపల్లి, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):**

తెలంగాణ అసెంబ్లీ సమీపంలోని బాచుపల్లి సిగ్నల్ వద్ద మహిళా ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుచితంగా, అవమానకరంగా ప్రవర్తించిందని ఆరోపిస్తూ నిర్వహించిన మహాధర్నాలో 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ పాల్గొన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానం తెలంగాణ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని నాయకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆగం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ మహిళా ఎమ్మెల్యేల పట్ల అవమానకరంగా వ్యవహరించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. మహిళా ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇలాంటి ఘటనలకు బాధ్యులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల ఆత్మగౌరవం కోసం తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ పరిశీలన

- దుండిగల్, బౌరంపేట పెద్ద చెరువుల్లో ఏర్పాట్లపై సమీక్ష

**దుండిగల్, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):**

గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ పెద్ద చెరువు, బరంపేట పెద్ద చెరువులను ఆయన సందర్శించి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రేన్ల ఏర్పాటు, విద్యుత్ దీపాల ఏర్పాటు, బారికేడింగ్, పారిశుద్ధ్య నిర్వహణ తదితర పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, ఏఎంసీ లక్ష్మయ్యతో పాటు సర్కిల్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సిటీటైమ్స్
తెలుగు దినపత్రిక
www.citytimesnews.com



epaper.citytimesdaily.com




# బ్రిక్స్ సదస్సులో ఏకాభి ప్రాయం సాధ్యమేనా?

ఈ నెల 12-13 తేదీలలో ఢిల్లీలో భారత్ అధ్యక్షతన జరగనున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంపై అందరిలో ఆసక్తి నెలకొంది. బ్రిక్స్ అజెండాను ముందుకు తీసుకెళ్లడానికి భారతదేశం ఈ ఏడాది జనవరి నుంచే పలు వర్గాలతో 350కి పైగా సమావేశాలు నిర్వహించింది. సెప్టెంబర్ 2023లో ఢిల్లీలో జీ20 శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యమిచ్చిన అనుభవాన్ని ఉపయోగించి బ్రిక్స్ సదస్సును ఒక ప్రధాన అంతర్జాతీయ కార్యక్రమంగా మార్చడానికి భారతీయ అధికారులు శ్రమిస్తున్నారు.

బ్రిక్స్ ఒక సాధికార ఒప్పందం ద్వారా ఏర్పడిన సంఘం కాదు. పెద్దమనుషుల తరహాలో వివిధ అంశాలపై చర్చించుకుని, పరిష్కారం కనుగొనడానికి ఏర్పడిన అనధికార వేదిక అది. అయినా నేటి ప్రపంచంలో ముఖ్యమైన బహుళపక్ష సంస్థగా పేరుతెచ్చుకుంది. గడచిన రెండు దశాబ్దాల్లో బ్రిక్స్ కొన్ని సమస్యలను ఎదుర్కొంది, కొన్ని విజయాలూ సాధించింది. కొంతమంది విశ్లేషకులు బ్రిక్స్‌ను కబుర్లతో కాలక్షేపం చేసే సంస్థగా తీసిపడేస్తుంటే, మరికొందరేమా బ్రిక్స్ దేశాలు, వాటి ఆశయాలు ప్రత్యేక పరిగణనకు అర్హమైనవని వాదిస్తున్నారు. జీ20, జీ7, ఎస్సీవో వంటి బహుళపక్ష సంస్థలు ప్రాధాన్యాన్ని సంతరించుకోవడానికి కష్టపడుతుంటే, వర్ధమాన దేశాలకు కీలక వేదికగా బ్రిక్స్ గుర్తింపు తెచ్చుకుంటోంది. అయినప్పటికీ, అది తీవ్రమైన సవాళ్లనూ ఎదుర్కొంటోంది.

ప్రపంచంలో నేడు అశాంతి, ఉద్రిక్తతలు నెలకొని ఉండటంతో ఈసారి బ్రిక్స్ శిఖరాగ్ర సభపై అంచనాలు తక్కువగానే ఉన్నాయి. ఫిబ్రవరి 2022 నుంచి రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్- అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రతిష్టంభనకు దారితీసింది. బ్రిక్స్ సభ్య దేశాలైన సౌదీ అరేబియా, యూఏఈలు ఈ యుద్ధంలో అమెరికా వైపు ఉండి, ఇరాన్ ప్రతిదాడికి గురవుతున్నాయి. ఇరాన్ మొదటినుంచీ అమెరికా, ఇజ్రాయెల్‌లకు బద్ధ విరోధి. ఇరాన్, సౌదీ, యూఏఈల వైరం బ్రిక్స్ వేదికలో చీలికను చూపుతోంది. అయినప్పటికీ, రాబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సభ మంచి ఫలితాన్ని ఇస్తుందనే ఆశ ఎంతోకొంత ఉంది.

అమెరికా... ఇరాన్... మొగ్గు ఎటువైపు?

మూడేళ్ల కిందట జోహన్నెస్‌బర్గ్, 2024లో కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సమావేశాలు సభ్యత్వ విస్తరణపై దృష్టి పెట్టాయి. అది ఫలించి ఇప్పుడు యురేసియా, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల నుంచి మొత్తం 11 సభ్య దేశాలు, 10 భాగస్వామ్య దేశాలు బ్రిక్స్ ఛత్రం కిందకు చేరాయి. బ్రిక్స్‌లో భాగస్వామి అయిన ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాక జూలై 2025లో రియో డి జనీరోలో జరిగిన శిఖరాగ్ర సభలో సందడి కనిపించలేదు. ఇక మరికొద్ది రోజుల్లో ఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సమావేశం గణనీయ ఫలితాలను ఇస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే, ఇక్కడ ఆరు నిర్దిష్ట అంశాలను గమనించాలి.

ఒకటి- ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాలను పరిష్కరించడంలో బ్రిక్స్ ముఖ్య పాత్ర పోషించలేకపోవడం. ఈ రెండు ఘర్షణలలో పాత్రధారులైన రష్యా, ఇరాన్‌లు బ్రిక్స్ సభ్యదేశాలే. అందువల్ల కూటమిలో అంతర్గత చీలికలు వాస్తవం. బ్రిక్స్ ఆ చీలికలతో జీవించడం నేర్చుకుంది. ఈ రెండు యుద్ధాలకు కారకులెవరో నిశ్చయించకుండా... సంభాషణ, దౌత్యాల ద్వారా శాంతిసయోధ్యలను సాధించాలని బ్రిక్స్ సభ పిలుపిచ్చే అవకాశం ఉంది. బ్రిక్స్ స్పష్టమైన ఒకేస్వరంతో అలా పిలుపిస్తే దానికి ప్రాధాన్యం ఉంటుంది. అందుకే భారత్ ఏకాభిప్రాయ సాధనకు శాయశక్తులా ప్రయత్నించనుంది. మరోవైపు ఇరాన్‌పై తాజాగా అమెరికా ప్రకటించిన కరకు వైఖరి బ్రిక్స్‌కు ఇబ్బందులు కలిగించవచ్చు. ఇరాన్‌పై 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్'(ఆర్థిక వెలి)ని ప్రారంభించనున్నట్లు అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ ఇటీవల ప్రకటించారు. దీని ఉద్దేశం ఇరాన్ ఆర్థిక జీవనాడులన్నింటినీ కత్తిరించి ఒంటరి చేయడం. టెహరాన్‌తో ఆర్థిక సంబంధాలు ఉన్న దేశాలు ఇరాన్‌ను లేదా అమెరికాను ఎంచుకోవాలని వాషింగ్టన్ పేర్కొంది. బ్రిక్స్ సభ ఈ క్లిష్టమైన సవాలును ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

రెండో అంశం- జరుగుతున్న ఘర్షణలను పరిష్కరించడంలో బ్రిక్స్ అశక్తత స్పష్టంగానే తెలుస్తున్నప్పటికీ... రాజకీయ, ఆర్థిక, భద్రతా సహకారం, ప్రజల మధ్య సంబంధాలను ప్రోత్సహించడం ద్వారా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని బ్రిక్స్ దేశాల నాయకులు పునరుద్ఘాటిస్తారు. మూడు- ఐరాసలో సంస్కరణలను బ్రిక్స్ గట్టిగా ప్రతిపాదించనుంది. కానీ భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం దక్షిణాఫ్రికా అభ్యర్థిత్వాన్ని సాటి ఆఫ్రికా దేశాలైన ఈజిప్ట్, ఇథియోపియాలు ప్రశ్నించడం చిక్కులను సృష్టించనుంది. దీనివల్ల భారత్, బ్రెజిల్‌లకూ ఆశాభంగం ఎదురుకావచ్చు.

వర్ధమాన దేశాలకు మార్గదర్శి

ఇక నాలుగో విషయం- ఆచరణాత్మక సహకారాన్ని ఉమ్మడిగా వివిధ రంగాలకు విస్తరించడానికి ఈ ఏడాది బ్రిక్స్ ఛైర్మన్ హోదాలో భారత్ ప్రయత్నిస్తుంది. స్థితిస్థాపకత, నవీకరణ, సహకారం, సుస్థిరత అనే లక్ష్యాల సాధనకు ముందుకు సాగుతుంది. మానవాళి శ్రేయస్సుకే అగ్ర ప్రాధాన్యమనే నినాదంతో పురోగమిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ఉద్ఘాటించారు. అయిదు- ఆర్థికం, వాణిజ్యం, పర్యావరణం, సంస్కృతి, విద్య, పరిశ్రమలు తదితర రంగాలలో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలనే పిలుపు కూడా బ్రిక్స్ సభలో వెలువడుతుంది. అయితే, దాన్ని ఆచరించి చూపడంలోనే బ్రిక్స్ సత్తా బయటపడుతుంది. ఆరు- బ్రిక్స్ న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ను బలోపేతం చేసి వాణిజ్యం, పెట్టుబడి ప్రవాహాలకు మద్దతు ఇవ్వాలి. బ్రిక్స్ రాజ్యాలు, ఇతర దేశాల మధ్య వాణిజ్య చెల్లింపులను తక్కువ ఖర్చుతో వేగవంతంగా జరపడానికి చర్యలు తీసుకోవాలి. చివరగా, బ్రిక్స్ సభ్యత్వం భారత విదేశాంగ విధానానికి వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ఇస్తుంది. వర్ధమాన దేశాలకు భారత్‌ను మార్గదర్శిగా నిలుపుతుంది. అత్యంత ముఖ్యమైన దేశాలతో, ప్రాంతాలతో సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, దౌత్య సంబంధాలను విస్తరించడానికి సాయపడుతుంది. భారత్ సారథ్యంలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సభ కచ్చితంగా మంచి ఫలితాలను ఇస్తుందని ఆశిద్దాం.

# ఒళ్లంతా అవినీతి బురదే!

**భారతావని సమైక్యతను పరిరక్షించే ఉక్కుచట్రంగా సివిల్ సర్వీసులు వెలుగొందాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశించారు. కానీ, ప్రజాసేవను పక్కనపెట్టి తప్పుడుదోవల్లో తమ జేబులు నింపుకోవడానికి తహతహలాడుతున్న కొందరు అవినీతి ఉన్నతాధికారుల పుణ్యమా అని ఆ ఉక్కుచట్రం క్రమంగా తుప్పపడుతోంది. లంచాల మేతలకు అలవాటుపడిన పెద్దమనుషుల దెబ్బకు తన స్వరూప స్వభావాలనే కోల్పోతోంది. ఉద్యోగంలోకి రాకమునుపు సమాజ సేవకుల్లా నీతిసూత్రాలు చెబుతూ రాజ్యాంగ విధేయత, పారదర్శక పాలన, పేదరిక నిర్మూలన అంటూ తెగ కలవరించే కొంతమంది- సివిల్ సర్వీసుల్లోకి రాగానే ఆదర్శాలకు చెల్లుచీటీ రాస్తున్నారు. నిర్లజ్జగా అక్రమాలకు పాల్పడుతూ ఉన్నతాధికార స్థానాలపై సమాజంలో ఉండే గౌరవమర్యాదలను నీరుగారుస్తున్నారు.**



మంచి వేతనం, పెద్ద బంగ్లా, కారు, భద్రత, వ్యక్తిగత సిబ్బంది... అసలు ఐఏఎస్, ఐపీఎస్ అంటేనే ఆ దర్జానే వేరు. ఆ ఆర్భాటాల మాయలో పడిన వారు ప్రజలకు దూరమవుతారు. అలాకాకుండా తమ చేతిలోని అధికారాన్ని సామాన్యుల కోసం సద్వినియోగం చేస్తే, జనం వారిని గుండెల్లో పెట్టుకుంటారు. కానీ, అలా సమాజానికి ఉపయోగపడదామన్న ఆలోచనే కొందరిలో ఉండట్లేదు. అరుదైన అవకాశాన్ని అందించిన దేశానికి రుణపడి ఉంటూ పేదసాదల బతుకులను మార్చడానికి తామేం చేయాలన్న తలపును కూడా వారు దగ్గరికి రానివ్వట్లేదు. ఎంతసేపూ ఎంతెంత సంపదను కూడగట్టుకుందామా అన్నదానిపైనే వాళ్ల దృష్టి అంతా ఉంటోంది. హరియాణాలో భారీ ఆర్థిక నేరం కేసులో సీబీఐ తాజాగా ఆరుగురు ఐఏఎస్‌లపై మూడో ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో బ్యాంకు అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బందితో ఐఏఎస్‌లు కుమ్మక్కు అయ్యి హరియాణా ప్రభుత్వ శాఖలు, సంస్థలకు చెందిన దాదాపు ఆరు వందల కోట్ల రూపాయల నిధులను దారిమళ్లించారని చెబుతున్నారు. కింది స్థాయి సిబ్బంది సక్రమ మార్గంలో నడిచేలా చూడాల్సినవారే ఇలా బుద్ధిగడ్డి తిని ప్రజాధనాన్ని స్వాహా చేయడమెంత సిగ్గుచేటు!

రాజస్థాన్ జల్‌జీవన్ మిషన్ టెండర్లలో అవకతవకలకు పాల్పడ్డారంటూ మాజీ ఐఏఎస్ అధికారి సుబోధ్ అగర్వాల్‌ను ఏసీబీ ఇటీవల అరెస్టు చేసింది. గతంలో ఈయన అదనపు ప్రత్యేక కార్యదర్శిగా ఉద్యోగం వెలగబెట్టారు. అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాక చాలారోజులు పరారీలో ఉన్నారు. అడుసు తొక్కనేల.. కాలు కడగనేల అన్నట్లు అడ్డగోలు మార్గాల్లో డబ్బు వెనకేసుకోవడానికి అర్రులు చాచకుండా ఉంటే దొంగలా బతకాల్సిన అగత్యం తప్పేది కదా! కర్ణాటకలో పశువైద్యాధికారుల పోస్టుల మంజూరుకు లంచాలు కతికిన కేసులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్రకుమార్‌ను సీఐడీ అదుపులోకి తీసుకుంది. అయిదు వేల కోట్ల రూపాయల నకిలీ మందుల రాకెట్ దర్యాప్తును ఒక వ్యాపారికి అనుకూలంగా మార్చేందుకు రూ.3కోట్ల లంచం అడిగిన ఆరోపణ మీద హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లోవత్‌ను మొన్న జులైలో సీబీఐ అరెస్టు చేసింది. సామాన్య ప్రజల ప్రాణాలతో ముడిపడిన కేసులోనూ ఇలా అవినీతి దారులు వెతకడం ఎంత హేయం! ఇలాంటి వారిని ఊరికే వదిలేస్తే సామాజిక ద్రోహులు మరింతగా చెలరేగిపోవడం ఖాయం!

'ఐఏఎస్‌లలో పాతికశాతం అవినీతిపరులు, అసమర్థులుంటే మరో యాభై శాతం మంది పెద్దగా కష్టపడరు. మిగిలిన పాతిక శాతం మందితోనే పాలనా వ్యవహారాలు నడిపించాల్సి వస్తోంది' అని లోగడ ఒక ముఖ్యమంత్రి వాపోయినట్లు ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఒక సందర్భంలో వెల్లడించారు. జనభారతానికి రక్షాకవచాలు కావాల్సిన సివిల్ సర్వీసులు ఎలా చేవచచ్చిపోతున్నాయనడానికి ఇదో నిదర్శనం. ప్రజల బాగోగులే లక్ష్యంగా మేలిమి పథకాలు, కార్యక్రమాలను రూపొందించడంలో కీలకంగా వ్యవహరించాల్సిన ఐఏఎస్‌లు కొందరు 'నీకిదినాకది' అంటూ రాజకీయ నాయకుల విచ్చలవిడి మేతలకు తోడ్పడుతున్నారు. ఒకవైపు నిజాయతీపరులకు వరస బదిలీలే బహుమానాలవుతుంటే, నిత్యం అవినీతి మడుగులో ఈదులాడే ఇలాంటివారు మాత్రం ఉన్నత పోస్టులు దక్కించుకుని నేతల పట్ల ఎక్కడాలేని స్వామిభక్తిని ప్రదర్శిస్తున్నారు. మీరు స్కాములకు ప్రణాళికలు వేయండి.. రకరకాల లొసుగులు వెతికి వాటికి ఆమోదముద్ర వేసే బాధ్యత మాది అన్నట్లు చెలరేగిపోతున్నారు. తీరా పరిస్థితి వికటించాక అభాసుపాలవుతున్నారు. ప్రభుత్వ, ప్రకృతి వనరుల స్వాహాపర్వాల్లో పాత్రధారులయ్యారనే అభియోగాల మీద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది మంది ఐఏఎస్‌లు కేసుల్లో చిక్కుకుని తీరని అప్రతిష్ఠ మూటగట్టుకున్నారు. ఇలా పేరాశలకు పోయి పరువు పోగొట్టుకున్న వారిని చూసైనా మిగిలిన అధికారులు గుణపాఠం నేర్చుకోకపోతుండటమే విస్మయపరుస్తోంది!

అవినీతిపరులకు, ఆశపోతులకు మనశ్శాంతి ఎప్పుడూ ఉండదని వేమన ఎప్పుడో తేల్చిచెప్పాడు. మందిసొమ్ము తిన్నవారు బాగుపడరని హెచ్చరించాడు. నైతిక నిష్ఠకు తిలోదకాలిస్తే ఎంతగా అధోగతి పాలవ్వాల్సి ఉంటుందో సివిల్ సర్వెంట్లకు తెలియనిది కాదు. అయినా, ఎలాంటి జంకుగొంకు లేకుండా అవినీతి బురదను మహదానందంగా ఒంటికి రాసుకుంటున్న ఉన్నతాధికారగణం నానాటికీ పెరిగిపోతుండటమే జాతి దౌర్భాగ్యం! గడిచిన అయిదేళ్లలో 110 అవినీతి కేసుల్లో 166 మంది సివిల్ సర్వెంట్ల మీద సీబీఐ కేసులు కట్టిందంటే ప్రజాసేవకుల ముసుగులో ఎక్కడికక్కడ భ్రష్టాచారులు ఎంతగా పోగుపడ్డారో అర్థం చేసుకోవచ్చు. కానీ, శిక్షలు ఖరారయ్యేలోగా ఎంతోమంది మరింత ఉన్నత స్థానాలకు ఎదుగుతూ ఇంకా భారీగా వెనకేసుకుంటున్నారు. సామాజిక ద్రోహులతో చేతులు కలుపుతున్న మరికొందరేమో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. పటిష్ఠ భారతావని నిర్మాణానికి బలమైన పునాదిలా ఉండాల్సిన సివిల్ సర్వీస్ వ్యవస్థ ఇలాంటి నీతిబాహ్య అధికారుల వల్ల బలహీనపడితే దేశ పురోగతే దెబ్బతింటుంది. ఆ దురవస్థకు అడ్డుకట్ట వేయాలంటే సుప్రీంకోర్టు సూచించినట్లు ప్రభుత్వ ఉద్యోగుల అవినీతిని రాజ్యానికి, సమాజానికి వ్యతిరేకమైన నేరంగా పరిగణించాలి. సంబంధిత కేసుల్లో త్వరితగతిన శిక్షలు పడేలా చూడటంతో పాటు నీతినిజాయతీలకు తిలోదకాలిచ్చే అధికారుల ఆస్తులను జప్తు చేయాలి. స్వీయప్రయోజనాలే తప్ప ప్రజాసేవానురక్తి, అంకితభావం లేశమాత్రం లేనివారిని సర్వీసుల్లోంచి వీలైనంత త్వరగా సాగనంపాలి. కానీ, రాజకీయ అవినీతి వేయితలల విషసర్పమై బుసలుకొడుతున్న భారతావనిలో ఈ సంస్కరణలకు నడుంకట్టేదెవరు?

# పారిశ్రామిక ప్రగతికి పెద్ద సవాలు

**దేశీయ ఆటోమొబైల్ రంగం ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీలు), రోబోటిక్స్, ఆటోమేషన్, కనెక్టెడ్ టెక్నాలజీల వైపు శరవేగంగా పయనిస్తోంది. ఈ క్రమంలో పవర్ ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్, బ్యాటరీ నిర్వహణ, మెకట్రానిక్స్ నిపుణుల అవసరం అధికమవుతోంది. అలాంటి వారు తక్కువగా ఉండటం పరిశ్రమ వృద్ధికి ప్రతిబంధకంగా మారుతోంది. తాజా అధ్యయనం ప్రకారం దేశవ్యాప్తంగా 61శాతం వాహన విడిభాగాల తయారీ సంస్థలు నిపుణ మానవ వనరుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి కర్మాగారాలైతే ఇంకా ఎక్కువగా ఈ సమస్యతో అల్లాడుతున్నాయి. అతిపెద్ద ఆటోమోటివ్ హబ్‌లలో ఒకటైన పుణెలో పరిశ్రమలకు ఏటా 27వేల మంది నైపుణ్యవంతులు కావాల్సి ఉంటే- స్థానికంగా అయిదు వేల మందే అందుబాటులోకి వస్తున్నారు. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తాజాగా పిలుపిచ్చినట్లు, భారత ఆటోమొబైల్ పరిశ్రమ నాణ్యమైన ఉత్పత్తులను రూపొందిస్తూ ప్రపంచ మార్కెట్లను ఒడిసిపట్టాలంటే- ముందు సుశిక్షిత శ్రామికుల లభ్యతను పెంచాలి. 2030 నాటికి ఈవీల విభాగంలోనే నాలుగుకోట్ల ఉద్యోగాలు అందివస్తాయంటున్నారు. అవి చేజారిపోకూడదంటే, మన యువశక్తిని సద్వినియోగం చేసుకునే ప్రణాళికలు వేగంగా పట్టాలకెక్కాలి. దేశ పురోగతికి వెన్నెముక వంటి అత్యాధునిక సాంకేతికతల్లో నిపుణులను విరివిగా సిద్ధంచేసుకోవాలి!**



ఆర్థికాభివృద్ధి, జాతీయ, ఆహార భద్రత, పర్యావరణ, ఆరోగ్య పరిరక్షణలకు ఏఐ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, గ్రీన్‌ఎనర్జీ వంటివి కీలకమవుతున్నాయి. వాటిలో మేలిమి మానవ వనరుల లేమి వల్ల వికసిత్ భారత్ లక్ష్యాలు దెబ్బతింటున్నాయి. 2024లో దేశీయ పరిశ్రమలకు అవసరమైన ఏఐ నిపుణుల్లో సుమారు 50శాతం తరుగుపడినట్లు పరిశీలనలు చెబుతున్నాయి. కృత్రిమ మేధ వ్యవస్థలను పరిశ్రమలకు అనుసంధానించడం, ఏఐ భద్రత, నియంత్రణ విభాగాల్లో ప్రతిభావంతుల కొరత వేధిస్తోంది. ఇటీవలి మరో అధ్యయనంలో 73శాతం సంస్థలు, 68శాతం సర్వీస్ ప్రొవైడర్లు మెరికల్లాంటి సైబర్ భద్రతా నిపుణుల లోటును ఎదుర్కొంటున్నట్లు తేలింది. ఇక ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెమీకండక్టర్ల డిజైనర్లలో 20శాతం మంది భారతీయులే అయినప్పటికీ చిప్‌ల తయారీ, ప్యాకేజింగ్, పరికరాల నిర్వహణ తదితరాల్లో పట్టున్నవారు మన దగ్గర కొరవడుతున్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల శుద్ధ ఇంధన సామర్థ్యాన్ని సాధించాలన్నది భారతావని సంకల్పం. 2027 నాటికి ఆ రంగంలో 17లక్షల మంది ప్రతిభావంతులకు కరవు నెలకొనవచ్చునన్న విశ్లేషణలు తగిన దిద్దుబాటు చర్యల ఆవశ్యకతను గుర్తుచేస్తున్నాయి!

ప్రస్తుతం సాంకేతికతలు శరవేగంగా మారుతున్నాయి. అనేక రంగాలు సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నాయి. పైగా అనేక టెక్నాలజీలు ఒకదానిపై ఒకటి ఆధారపడుతున్నాయి. వాటి ప్రయోజనాలను భారతావని కోల్పోకూడదంటే మానవ వనరులను సానపట్టడంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదు. ఆయా విభాగాలకు ఎంతమంది సమర్థ ఉద్యోగులు కావాల్సి ఉంటుందో ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. పరీక్షల చుట్టూ తిరుగుతున్న విద్యావ్యవస్థను ప్రక్షాళించి ప్రాజెక్టు ఆధారిత అభ్యసనానికి ప్రాధాన్యమివ్వాలి. పాఠ్యాంశాల రూపకల్పనలో పరిశ్రమలకూ స్థానం కల్పించాలి. ఇంజినీరింగ్ చదువుతున్న ప్రతి విద్యార్థికీ నిర్ణీత కాలంపాటు క్షేత్రస్థాయి శిక్షణను తప్పనిసరి చేయాలి. ఐటీఐ, పాలిటెక్నిక్ చదువులనూ మరింత బలోపేతం చేసుకోవాలి. ఇప్పటికే కొలువుల్లో ఉన్నవారికి కొత్త నైపుణ్యాలు మప్పాలి. నవీకరణల్లో ఇండియా దూసుకెళ్లాలంటే కేవలం సాంకేతికతను వినియోగించేవారే కాకుండా, నూతన టెక్నాలజీలకు ప్రాణంపోయగలిగిన పరిశోధకుల సంఖ్యను పెంచుకోవాలి. అందుకోసం ఆర్‌అండ్‌డీపై పెట్టుబడులను ఇతోధికం చేయాలి!

# యురేకా క్షణం మీకూ ఉందా?

**ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణమూర్తి యాభయ్యేళ్ల క్రితం ఒకసారి బల్గేరియాలో రైలులో ప్రయాణిస్తున్నారు. పక్క సీట్లో కూర్చున్న యువతీ యువకులతో మాటలు కలిపారు. ఆ సందర్భంగా నారాయణమూర్తి అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని భావించిన పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి తిండీతిప్పలు లేకుండా మూడు రోజులు బంధించారు. 'ఏ తప్పూ చేయకున్నా, ఇంతటి అవమానానికి గురవడానికి కారణం నాకంటూ ఒక గుర్తింపు లేకపోవడమేనా?' అని నారాయణమూర్తి బాధపడ్డారు. వాళ్లు విడుదల చేసి రైలెక్కించాక అక్కడ ఒంటరిగా ప్రశాంతంగా ఉన్నప్పుడు ఆయనకు ఒక మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. సమాజంలో అంతరాలను, పేదరికాన్ని నిర్మూలించాలంటే కేవలం భావజాలం సరిపోదు. సంపద, దాన్నుంచి సృష్టించే ఉద్యోగాలతోనే అది సాధ్యమని గ్రహించారు. ఈ ఆలోచనలోంచి పుట్టుకొచ్చిన కార్పొరేట్ సంస్థే 'ఇన్ఫోసిస్'. ఈ విషయాన్ని నారాయణమూర్తి పలు సందర్భాల్లో తన ప్రసంగాల్లో పేర్కొన్నారు.**

టాటా గ్రూప్ మాజీ ఛైర్మన్ రతన్ టాటా ఒకరోజు కారులో ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో పెద్ద వాన కురుస్తోంది. రోడ్డుమీద ఒక స్కూటరుపై భార్యాభర్తలు, ఇద్దరు చిన్నపిల్లలతో తడుస్తూ ప్రమాదకరంగా వెళ్లడాన్ని చూశారు. ఇలాంటి మధ్యతరగతి వారికి తక్కువ బడ్జెట్లో, సురక్షితమైన కారును ఎందుకు తయారు చేయకూడదని టాటా ఆలోచించారు. అలా పురుడు పోసుకున్నదే 'టాటా నానో' కారు ఆలోచన. తన గదిలో ఆలోచిస్తున్నప్పుడో, వ్యాపార సమావేశంలో ప్రణాళికలు వేస్తున్నప్పుడో ఈ ఆలోచన తట్టలేదని ఆయన చెప్పేవారు.

గ్రీకు రాజు రెండో హియరోకు ఒకరోజు తన బంగారు కిరీటం స్వచ్ఛత పట్ల అనుమానం వచ్చింది. దాన్ని కరిగించకుండా ఎంత స్వచ్ఛమైనదో కనుక్కోవాలని ఆదేశించాడు.

ఆ సమస్యపై గణిత, భౌతికశాస్త్ర మేధావి ఆర్కిమెడిస్ పగలూ రాత్రీ ఆలోచించాడు. ఓ రోజు బాగా అలసిపోయి స్నానం కోసం టబ్‌లోకి దిగాడు. లోపలకు దిగగానే నిండుగా ఉన్న టబ్‌లోంచి కొంత నీరు బయటికి ఒలకడాన్ని గమనించాడు. అంతే.. ఆ క్షణంలో సాంద్రత సూత్రం తళుక్కున మదిలో మెరిసింది. ఆ ఆనందంలో ఆయన ఉన్నపళంగా లేచి రోడ్డుపైకి పరిగెత్తుతూ 'యురేకా... యురేకా (నేను కనుగొన్నాను)' అని అరిచాడట. రాజు అడిగిన ప్రశ్నకు ప్రయోగశాలలో తట్టని పరిష్కారం... స్నానపు తొట్టెలో సేదతీరుతున్నప్పుడు దొరికింది.

# అక్రమ నిర్మాణాలపై కొనసాగుతున్న కొరడా.. 14 కూల్చివేతలు




- సీఎంసీ మూడు జోన్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్.. నేడు 14 నిర్మాణాల నేలమట్టం
- మరో మూడు నిర్మాణాలకు నోటీసులు.. క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న తనిఖీలు

సైబరాబాద్, సెప్టెంబరు 8 (సిటీటైమ్స్):

అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) చర్యలు కొనసాగిస్తోంది. అనధికార నిర్మాణాలను గుర్తించి, భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు మూడు జోన్లలో క్షేత్రస్థాయి తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు ముమ్మరంగా చేపడుతోంది. ఇందులో భాగంగా మంగళవారం 14 అనధికార నిర్మాణాలను గుర్తించగా.. 14 కూల్చివేతలు చేపట్టింది. మరో మూడు నిర్మాణాలకు నోటీసులు జారీ చేసింది.

జోన్ల వారీగా శేరిలింగంపల్లి జోన్‌లో ఐదు, కూకట్‌పల్లి జోన్‌లో నాలుగు, కుత్బుల్లాపూర్ జోన్‌లో ఐదు నిర్మాణాలను కూల్చివేశారు. అనధికార నిర్మాణాలను గుర్తించిన దశ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టే వరకు నిర్దేశిత విధానాలను అనుసరిస్తున్నట్లు సీఎంసీ అధికారులు తెలిపారు. గుర్తించిన నిర్మాణాలపై వర్తించే నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

మూడు జోన్లలో సీఎంసీ బృందాలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి. తనిఖీల్లో గుర్తించిన నిర్మాణాలపై నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అనధికార నిర్మాణాలను గుర్తించడం, నిబంధనలను అమలు చేయడం, ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం వంటి ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.




## కేసీఆర్‌కు హాని తలపెట్టే వ్యాఖ్యలు..
# ఎమ్మెల్యే, సీఎంపై ఫిర్యాదు

- 'చావు' కోరుతూ బహిరంగంగా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ
- బీఎన్ఎస్‌లోని ఐదు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చందానగర్ పోలీసులకు బొబ్బ నవతారెడ్డి ఫిర్యాదు

శేరిలింగంపల్లి, సెప్టెంబరు 8 (సిటీటైమ్స్):

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్)ను ఉద్దేశించి షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్య బహిరంగంగా మరణాన్ని కోరుతూ, ఆయనకు హాని కలిగించేలా ప్రేరేపించే వ్యాఖ్యలు చేశారని చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కె. శంకరయ్యతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పేర్లు వెల్లడించని ఇతర కుట్రదారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరుతూ మంగళవారం చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి చందానగర్ సీఐ శ్రీధర్‌కు ఫిర్యాదు అందజేశారు.



కేసీఆర్ మరణాన్ని కోరుతూ, ఆయనకు హాని చేయడానికి ప్రేరేపించేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలని నవతారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న ఎమ్మెల్యే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతరుల కుట్ర ఉందంటూ ఫిర్యాదులో పేర్కొంటూ.. సమగ్ర దర్యాప్తు చేయాలని పోలీసులను కోరారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), 2023లోని సెక్షన్లు 196, 351(3), 352, 353, 61 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఉద్దేశించి ఈ తరహా వ్యాఖ్యలు చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజకీయ విభేదాలు సహజమే అయినా.. ఒక వ్యక్తికి హాని కలిగించేలా లేదా హింసను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వ్యసనాలకు దూరం .. భవిష్యత్తుకు బాట

- చిట్యాల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ
- నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం

చిట్యాల సెప్టెంబరు 08 (సిటీటైమ్స్)

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజాపిత బ్రహ్మకుమారి వనపర్తి సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. వ్యసన రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల నుంచే మార్పు ప్రారంభం కావాలి అని సూచించారు. వనపర్తి జిల్లా చిట్యాల ఉన్నత పాఠశాలలో గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కె. గణేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజాపిత బ్రహ్మకుమారి వనపర్తి సంస్థ, నషాముక్త్ భారత్ అభియాన్-మిషన్ స్పందన ఆధ్వర్యంలో మంగళవారం వ్యసన విముక్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



**విద్యార్థులతో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ**

కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారి శోభ విద్యార్థులకు వ్యసనాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మత్తు పదార్థాలు, పొగాకు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులందరితో వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

**యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ**

విద్యార్థి దశలో ఏర్పడే అలవాట్లు జీవితాంతం ప్రభావం చూపే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం యువతపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యక్రమంలో సూచించారు. వ్యసనాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమానికి తెలుగు పండితులు బూరోజు గిరిరాజాచారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి నాగమణి, జర్నలిస్టు భక్తరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురువులే భావితరాలకు మార్గదర్శకులు

- విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం
- ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలి.. ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్

వనపర్తి సెప్టెంబరు 08 (సిటీటైమ్స్)



విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి గురువుల చేతుల్లోనే ఉందని, సమాజానికి ఉత్తమ పౌరులను అందించే మహత్తర బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పిస్తూ వారి జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జీ. విష్ణు (ఎస్‌ఏ, వెలుగొండ), ఎస్. శివ (ఎస్‌ఏ, సవాయిగూడెం) లను మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితంపై అత్యంత ప్రభావం చూపేది గురువేనని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా లభించిన గుర్తింపు వారి సేవలకు దక్కిన గౌరవంతో పాటు, మరింత అంకితభావంతో పనిచేయాల్సిన బాధ్యతను పెంచుతుందని తెలిపారు.

**ప్రభుత్వ బడులే విద్యకు బలమైన పునాది**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సతీష్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా అవకాశాలపై తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం కల్పించి, తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా ప్రోత్సహించాలని కోరారు.

**ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు ఆదర్శం**

ఉపాధ్యాయులకు అందించే పురస్కారాలు వారి సేవలకు గుర్తింపుగా నిలవడమే కాకుండా ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయమే ఉపాధ్యాయుల నిజమైన విజయమని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన విష్ణు, శివలను అభినందిస్తూ వారి సేవలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, విజేత రాములు, చంద్రశేఖర్, సుజిత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## 10న చలో హైదరాబాద్
# విజయవంతం చేయాలి



- ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మహాధర్నా
- సమాచార శాఖ కార్యాలయంలో టీజీఈజేఏసీ నిరసన

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్-మహాధర్నాను విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ నాయకులు కటుకూరి శ్రీకాంత్, కందూరి వెంకట్ పిలుపునిచ్చారు. అందులో భాగంగా మంగళవారం సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ ఆవరణలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌సీ అమలు, ఆరు డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, జీపీఎఫ్ బకాయిల విడుదల, ఈహెచ్ఎస్ ఆరోగ్య పథకం అమలు తదితర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ నాయకులు కటుకూరి శ్రీకాంత్, కందూరి వెంకట్, టీజీవో నాయకులు కృష్ణయాదవ్, వనజ, వెంకటేశ్‌తో పాటు సమాచార శాఖ ఉన్నతాధికారులు, టీఎన్జీవోస్ ఐఅండ్‌పీఆర్ యూనిట్ కార్యవర్గ సభ్యులు, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి



- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రాజు

ఆత్మకూరు సిటీ టైమ్స్ సెప్టెంబర్ 8

ఆత్మకూర్ మండలంలో ఆశా కార్యకర్తల ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఇందిరా పార్కు ధర్నాకు బయలుదేరిన ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు, ఆశా వర్కర్లకు 18000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలల పిఆర్సి ఏరియర్స్ లేప్రసి సర్వే, పల్స్ పోలియో ,ఎలక్షన్ డ్యూటీ తదితర పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి, NCD ఆన్లైన్ చేయించకూడదు, స్కూటం డబ్బాలు మోపించకూడదని,ANC PNC తదితర టార్గెట్స్ ను రద్దు చేయాలి, ఆదివారం పండుగలకు సెలవులు, సంవత్సరానికి 20 క్యాజువల్ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు నిర్ణయించాలని,ANM GNM పోస్టులలో ఆశలకు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలి, డిమాండ్స్ అన్నిటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సెప్టెంబర్ 8న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనడానికి మండల పరిధిలోని ఆశా కార్యకర్తలు బయలుదేరుతుంటే అక్రమంగా ఆశా కార్యకర్తలైనటువంటి శాంతమ్మ నిర్మల శ్రీదేవి మాధవి స్వరూప ఈశ్వరమ్మ కవిత నర్సమ్మ యశోద మహేశ్వరి అనసూయ తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు..

# గడ్డిఅన్నారంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం కోరిన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

- విద్యుత్ సమస్యలపై డీఈకి వినతిపత్రం..
- స్తంభాలు, వైర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి..
- క్షేత్రస్థాయి పరిశీలనకు ఏడీఈ అనిల్‌కు డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఆదేశాలు

ఎల్బీనగర్ ,సెప్టెంబర్ 8 (సిటీ టైమ్స్):



రానున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం లేకుండా,ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆస్మాన్‌ఘాట్ విద్యుత్ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ డీఈ విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్‌లోని వివిధ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు తదితర సమస్యలను డీఈ దృష్టికి తీసుకెళ్లారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల వద్దకు భక్తులు,ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే అవకాశం ఉన్నందున విద్యుత్ వైర్లు, స్తంభాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి వివరించిన సమస్యలపై డీఈ విష్ణువర్ధన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవసరమైన చర్యలు తీసుకుని వెంటనే పరిష్కరించేలా ఏడీఈ అనిల్‌కు ఆదేశాలు జారీ చేశారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కోరారు.

# ఆత్మకూర్ లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ఆత్మకూరు సిటీ టైమ్స్ సెప్టెంబర్ 8**

మంత్రి డాక్టర్ వాకటి శ్రీహరి ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎలాంటి దళారీలు లేకుండా కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ 78 చెక్కుల పంపిణీ చేశారు ఆత్మకూర్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొని మార్కెట్ చైర్మన్ రహమతుల్లా మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, పాల్గొన్నారు. మండలా, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొని చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

# నేటి నుండి ... లక్కాకులమ్మ జాతర ప్రారంభం





**భీమదేవరపల్లి సెప్టెంబర్ 8 ( సిటీ టైమ్స్)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ లోని లక్కాకులమ్మ జాతర ఈనెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకులు కుక్కమూడి ప్రభుదాస్, ఆలయ కమిటీ చైర్మన్ మండల రవి తెలిపారు అతి ప్రాచీనమైన ఈ ఆలయాన్ని 2002 సంవత్సరంలో అప్పటి సర్పంచ్ కుక్కమూడి సుమ ఆధ్వర్యంలో ఆమె భర్త ప్రభుదాస్ లక్కాకులమ్మ జాతరను ప్రారంభించారు అంతకుముందు ఈ ప్రాంతంలో శ్రావణమాసం చివరి రోజుల్లో ఈ ప్రాంత రైతులు తమ వ్యవసాయ పనులు చేసేముందు లక్కాకులమ్మ గుట్ట పైకి వెళ్లి అమ్మవారిని తమ పంటలు కాపాడు తల్లి అని ప్రార్థించే వారట ఆ తర్వాత కాలక్రమమైన లక్కాకులమ్మ అమ్మవారిని మర్చిపోయిన క్రమంలో సర్పంచ్ సుమ ప్రభాస్ వెలుగులోకి తీసుకురావడమే కాకుండా ప్రతి ఏటా జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు జాతర కమిటీ చైర్మన్ మండల రవి ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారుఅయితే అమ్మవారి ఆభరణాలు ప్రతి ఏటా ముగియగానే ముల్కనూర్ లోని ఎస్బిఐ బ్యాంకు లాకర్ లో భద్రపరుస్తారు జాతర ముందు డోలు వాయిద్యాలతో బ్యాంకు నుండి ఆభరణాలు తీసుకొని అమ్మవారికి అలంకరిస్తారు జాతర అనంతరం బ్యాంకులో భద్రపరచ నున్నట్లు ప్రభాస్ తెలిపారు

# అక్షరమే అభివృద్ధికి ఆయుధం

- **అక్షరాస్యతతోనే సమాజంలో చైతన్యం.. ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి**
- **చదువుకు దూరమైన వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలి**
- **అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ర్యాలీలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



**వనపర్తి సెప్టెంబరు 08(సిటీటైమ్స్)**

అక్షరాస్యత ఉన్నప్పుడే వ్యక్తిలో చైతన్యం, కుటుంబంలో అభివృద్ధి, సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అన్నారు. విద్య మనిషికి జ్ఞానాన్ని అందించడంతో పాటు తన హక్కులు, బాధ్యతలను తెలుసుకునే శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. చదువుకు దూరంగా ఉన్న ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వనపర్తి పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు నిర్వహించిన అక్షరాస్యత అవగాహన ర్యాలీలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని అక్షరాస్యత ప్రాధాన్యతను తెలియజేసే ప్లకార్డులు చేత బట్టి, నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చదువు అనేది కేవలం అక్షరాలను నేర్చుకోవడానికే పరిమితం కాదని, అది మనిషి ఆలోచనా విధానాన్ని మార్చి జీవితాన్ని మెరుగుపరిచే సాధనమని అన్నారు. అక్షరాస్యతతో వ్యక్తుల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, సమాజంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకుని సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందుతుందని తెలిపారు.

జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా చదువుకు దూరంగా ఉన్నవారిని గుర్తించి వారికి అక్షరజ్ఞానం అందించేందుకు విద్యార్థులు, యువత చొరవ తీసుకోవాలని సూచించారు. ఒక వ్యక్తికి అక్షరజ్ఞానం అందించడం అంటే ఒక జీవితానికి వెలుగునివ్వడమేనని ఆమె పేర్కొన్నారు. చదువు వల్ల వ్యక్తి తన హక్కులు, బాధ్యతలను తెలుసుకోవడమే కాకుండా కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగుపరుచుకునే అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

**అక్షరాస్యత ఉద్యమంగా మారాలి**

అక్షరాస్యత పెంపు ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే కాకుండా సామాజిక ఉద్యమంగా మారాలని అదనపు కలెక్టర్ ఆకాంక్షించారు. తాము నేర్చుకున్న విద్యను ఇతరులకు పంచుతూ, చదువుకు దూరంగా ఉన్నవారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

విద్యావంతమైన సమాజమే అభివృద్ధికి బలమైన పునాది అని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే పక్కాగా చేపట్టాలి

- **తప్పిదాలకు తావులేకుండా.. ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి**
- **భూ యజమానుల సందేహాలు అక్కడికక్కడే నివృత్తి చేయాలి**
- **నిర్దేశిత గడువులో ప్రక్రియ పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్**

**వనపర్తి, సెప్టెంబర్ 08(సిటీటైమ్స్)**

జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే ప్రక్రియలో చిన్నపాటి పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వకుండా, భూ యజమానుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పూర్తి పారదర్శకతతో పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రీసర్వేలో నమోదు చేసే భూమి విస్తీర్ణం, హద్దులు, యాజమాన్య వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పక్కా రికార్డులు రూపొందించాలని సూచించారు.

పానగల్, వీపనగండ్ల మండలాల పరిధిలోని జమ్మాపూర్, కొర్లకుంట గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన.. భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన తదితర ప్రక్రియలను పరిశీలించారు.

భూ యజమానుల సమక్షంలోనే కొలతలు, హద్దుల నిర్ధారణ వంటి ప్రక్రియలను నిర్వహిస్తూ, ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని అధికారులకు సూచించారు. రీసర్వే సందర్భంగా ఎదురయ్యే సాంకేతిక, రికార్డు సంబంధిత సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

రీసర్వే ప్రక్రియపై భూ యజమానులకు ఉన్న సందేహాలను అధికారులు ఓపికగా విని నివృత్తి చేయాలని వినోద్‌కుమార్ సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా క్షేత్రస్థాయిలోనే అవసరమైన సమాచారాన్ని అందించి, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పకడ్బందీ రికార్డులే లక్ష్యం**

భూ రీసర్వే పూర్తయిన అనంతరం రూపొందించే రికార్డులు భవిష్యత్తులో భూ లావాదేవీలు, యాజమాన్య హక్కుల నిర్ధారణకు కీలకంగా ఉండేలా ఖచ్చితత్వానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. రీసర్వే ద్వారా భూ సంబంధిత సమస్యలు, వివాదాలకు అవకాశం తగ్గేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో సర్వే ఏడీ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నాగారంలో ఓపెన్ నాలా సమస్యపై పరిశీలన

- **చెత్త, జంతువుల కళేబరాలతో దుర్వాసన.. దోమలు, ఈగలతో స్థానికుల అవస్థలు**
- **ఫేజ్–2లో ప్రతిపాదించిన నాలా ప్రాంతాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు**
- **ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్**



**నాగారం, సెప్టెంబర్ 8(సిటీ టైమ్స్ ):**

నాగారం డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీ, మల్లికార్జున్ నగర్ కాలనీ, అన్నమయ్య కాలనీలకు ఫేజ్ -2లో ప్రతిపాదించిన ఓపెన్ నాలా ప్రాంతాన్ని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంగ శ్రీహరి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కిష్టన్నగారి లింగం, మల్లికార్జున్ నగర్ కాలనీ అధ్యక్షుడు కిష్టన్నగారి రవి, రఘుపతి, వామన్‌రావు తదితరులు పరిశీలించారు.నాలాలో చెత్తతో పాటు జంతువుల కళేబరాలు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు, ఈగలు విపరీతంగా పెరగడంతో పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మురికి నీరు, పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా పారిశుధ్య సమస్య మరింత తీవ్రమవుతోందని నాయకులు పేర్కొన్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు చేపట్టి పరిష్కరిస్తామని నాయకులు హామీ ఇచ్చారు.







# చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి డీసీ రామలింగం సందర్శన

- **కాలనీ సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన.. పరిష్కారానికి చర్యలు**

**కీసర, సెప్టెంబర్ 8(సిటీ టైమ్స్ ):**

**చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించారు.మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగం మంగళవారం కాలనీని సందర్శించి, అక్కడి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చీర్యాల వార్డు ఆఫీసర్ మానసతో కలిసి కాలనీలో పర్యటించిన ఆయనకు స్థానికులు తమ సమస్యలను వివరించారు.ప్రధానంగా ఇంటి నంబర్ల కేటాయింపు, డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి సరఫరా, అంతర్గత రహదారులకు సంబంధించిన సమస్యలను కాలనీ వాసులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను విన్న రామలింగం సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన తెలిపారు.సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ స్వయంగా కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.**

# నాగారం రోడ్డు భద్రతపై అఖిలపక్ష ఏకాభిప్రాయం

- యూటర్న్‌లు, పాదచారుల క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఏకగ్రీవ తీర్మానం
- ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్
- కళ్ల కాంపౌండ్–రాఘవేంద్ర హోటల్ పరిసరాల్లో యూటర్న్ ఏర్పాటుకు ప్రతిపాదన
- ఎస్వీ నగర్ ఎస్‌బీఐ, నాగారం ప్రభుత్వ పాఠశాల వద్ద క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని సూచన
- దమ్మాయిగూడ మార్గంలో జీబ్రా క్రాసింగ్, గ్రిల్ ఓపెనింగ్స్‌కు ప్రతిపాదన
- డీసీపీ, సీపీ అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయం
- ప్రజా భద్రత కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తాం: అఖిలపక్ష నాయకులు



**నాగారం, సెప్టెంబర్ 8 (సిటీ టైమ్స్):**

నాగారం ప్రధాన రహదారిపై నెల కొన్న యూటర్న్‌లు, పాదచారుల క్రాసింగ్, ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపేందుకు అఖిలపక్ష నాయకులు ఏకతాటిపైకి వచ్చారు. నాగారం సత్యనారాయణ కాలనీ కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో రహదారి భద్రత, పాదచారులు రోడ్డు దాటే సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.ప్రజల ప్రాణ భద్రత, రాకపోకల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో యూటర్న్‌లు, సురక్షితమైన పాదచారుల క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

యూటర్న్ ఏర్పాటుకు ప్రతిపాదన

కళ్ల కాంపౌండ్ సమీపంలో, రాఘవేంద్ర హోటల్ వద్ద లేదా మార్బుల్ షాప్ పరిసరాల్లో సాంకేతికంగా అనువైన ప్రాంతాన్ని అధికారులు గుర్తించి యూటర్న్ ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు.దీనివల్ల ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పాదచారుల భద్రతకు చర్యలు

ఎస్వీ నగర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో పిల్లలు, మహిళలు, వృద్ధులు సురక్షితంగా రోడ్డు దాటేందుకు ప్రత్యేక క్రాసింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే నాగారం ప్రభుత్వ పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాదచారుల క్రాసింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. దమ్మాయిగూడ వైపు వెళ్లే మార్గంలో జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో ఉన్న గ్రిల్స్‌కు ఓపెనింగ్స్ కల్పించి పాదచారుల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని ప్రతిపాదించారు.డీసీపీ, సీపీకి వినతిపత్రాలు

ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందులో భాగంగా అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో డీసీపీ, సీపీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు."పార్టీలు వేరైనా.. ప్రజా సమస్య విషయంలో మా మాట ఒక్కటే. నాగారం ప్రజల భద్రత కోసం అవసరమైన యూటర్న్‌లు, పాదచారుల క్రాసింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే వరకు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రజా భద్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పని చేస్తాం" అని అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు.

# పాలిటెక్నిక్ కాలేజీ భూములపై సర్కారు కన్ను





- **శక్తిలో విలీనానికి రేవంత్ సర్కారు కుట్ర:ఏనుగు సుదర్శన్ రెడ్డి**

**మేడ్చల్ (సిటీ టైమ్స్), సెప్టెంబర్ 8:**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యా శాఖ నుంచి కార్మిక శాఖలో విలీనం చేసి,శక్తి పేరుతో పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆరోపించారు.

మంగళవారం మేడ్చల్ డివిజన్ పరిధిలోని గిర్మాపూర్ లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను బీజేపీ యువ మోర్చా రాష్ట్ర నాయకులు బండారి పవన్ రెడ్డి, జిల్లా నాయకులు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ అధ్యక్షులు కొండం ఆంజనేయులు ముదిరాజ్‌లతో కలిసి ఏనుగు సుదర్శన్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా కళాశాలలోని పరిస్థితులను పరిశీలించి,విద్యార్థులతో మాట్లాడారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి తన అధీనంలోని శాఖల పనితీరును నిర్వీర్యం చేస్తూ,అక్రమంగా డబ్బులు దండుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.ఇందులో భాగంగానే రాష్ట్రంలోని 54 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల భూములపై ప్రభుత్వం కన్నేసిందని విమర్శించారు.సాంకేతిక విద్యా శాఖ పరిధిలో కొనసాగాల్సిన పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి' పేరుతో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలోకి తీసుకెళ్లి ప్రైవేటీకరించే ప్రయత్నాలను బీజేపీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.పాలిటెక్నిక్ కళాశాలల విలీనం వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన విద్యార్థులకు బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

ఉన్నత విద్యా వ్యవస్థ నుంచి కార్మిక శాఖలోకి పాలిటెక్నిక్ విద్యను విలీనం చేయడం ద్వారా విద్యార్థులను కేవలం 'స్కిల్డ్ లేబర్'గా ప్రభుత్వం చూస్తున్న భావన కలుగుతోందని,దీంతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని ఏనుగు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలల విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాంకేతిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్,వంశీధర్ రెడ్డి,రాఘవ రెడ్డి,ఎల్లంపేట మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కంచుకట్ల మహేష్, మేడ్చల్ డివిజన్ కార్యదర్శి బండి విష్ణుమూర్తి గౌడ్, శ్రీపాల్ రెడ్డి,కేశవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్‌లోని సర్వే నంబర్ 786లోని వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ కుమార్



**మేడ్చల్ (సిటీ టైమ్స్) సెప్టెంబర్ 8:**

మేడ్చల్ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 786లో ఉన్న వివాదాస్పద స్థలాన్ని మంగళవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ కుమార్,జీపీఓ అభిషేక్,మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్,స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ కుమార్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 786లో 17 ఎకరాల 9 గుంటల భూమిని మాత్రమే ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ కింద స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అక్కడ మొత్తం 18ఎకరాల 31 గుంటల భూమి ఉన్నట్లు వివరించారు.దీంతో అదనంగా ఉన్న భూమికి సంబంధించి ఆరోపణలు,వివాదం నెలకొన్నట్లు పేర్కొన్నారు.అలాగే 2003 సంవత్సరానికి ముందు పట్టా రికార్డుల్లో ప్రమీలాదేవి పేరు ఉన్నట్లు తెలిపారు. అనంతరం పట్టా రికార్డుల్లో ప్రమోద్ బన్సల్,అరుణ్ బన్సల్ పేర్లు నమోదైనట్లు వివరించారు.ఈ భూమికి సంబంధించిన 1983 సంవత్సరం నుంచి ఉన్న రికార్డులు,పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్స్పెక్టర్ కుమార్ స్పష్టం చేశారు.

# ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

- **దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కుండ భానుచందర్**

**మేడ్చల్, (సిటీ టైమ్స్) సెప్టెంబర్ 8:**

దళిత స్పీకర్‌పై ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాత మధుసూదన్ చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుండ భానుచందర్ తీవ్రంగా ఖండించారు.దళిత స్పీకర్‌ను అవమానించడం యావత్ దళిత సమాజం ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని ఆయన అన్నారు.ఎమ్మెల్సీ తాత మధుసూదన్ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని,దళిత స్పీకర్‌కు,దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని భానుచందర్ డిమాండ్ చేశారు.ఈ ఘటనపై బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం స్పందించి ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.దళితులను కేవలం ఓటు బ్యాంకుగా చూసే విధానాన్ని రాజకీయ పార్టీలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఎలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సహించబోదని స్పష్టం చేశారు.తక్షణమే క్షమాపణ చెప్పడంతో పాటు తగిన చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కుండ భానుచందర్ హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగ విలువలను, దళితుల ఆత్మగౌరవాన్ని గౌరవించాలని ఆయన కోరారు.



# దీనస్థితిలో కనిపించిన వృద్ధురాలికి అమ్మా నాన్న అనాధ సేవా ట్రస్ట్ లో ఆశ్రయం




**ఉప్పల్ (సిటీ టైమ్స్) సెప్టెంబర్ 8**

ఉప్పల్ బాగాయత్ లో మతిస్థిమితం తప్పి దీనస్థితిలో ఒంటరిగా కనిపించిన 73 ఏళ్ల దండు లచ్చమ్మ ను చూసిన అమ్మా నాన్న అనాధ సేవా ట్రస్ట్ చైర్మన్ G. సాయి నారాయణ, వెంటనే ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎస్సై మధు ఆధ్వర్యంలో, కానిస్టేబుల్ రాము సహకారంతో వృద్ధురాలిని అమ్మా నాన్న అనాధ సేవా ట్రస్ట్ ఆశ్రమంలో చేర్చుకుని ఆశ్రయం కల్పించడం జరిగింది. వృద్ధురాలికి ఆశ్రమంలో భోజనం, వసతి, సంరక్షణ అందించేందుకు ట్రస్ట్ నిర్వాహకులు ముందుకు వచ్చారు.ఈ సందర్భంగా చైర్మన్ G. సాయి నారాయణ మాట్లాడుతూ, ఆశ్రయం లేని వృద్ధులకు అండగా నిలవడం తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో M. నరసయ్య, సోషల్ వర్కర్ శివశంకర్ మరియు తదితరులు పాల్గొన్నారు.అమ్మా నాన్న అనాధ సేవా ట్రస్ట్, పుడమి స్కూల్ సమీపంలో, కొండాపూర్ గ్రామం, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ఉంటుందని తెలిపారు.

# పోక్సో చట్టం పైన అవగాహన అందరికీ అవసరం






- **కే. దీప జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్.**

**వనపర్తి సెప్టెంబర్ 8 ( సిటీటైమ్స్)**

పోక్సో చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలి అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అన్నారు.వనపర్తి జిల్లా పట్టణంలోని శిశు మందిర్ పాఠశాలలో,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి విద్యార్థులకు ప్రాథమిక హక్కులు,విధులు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటార్ వాహనాల చట్టం మరియు ఉచిత మరియు నిర్బంధ విద్యా హక్కు చట్టం గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ఉచిత న్యాయ సేవలు మరియు నల్సా టోల్ ఫ్రీ నెంబర్ 1500 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్: సెప్టెంబర్ 8 ( సిటీటైమ్స్)**

నగరంలోని కూకట్‌పల్లి పరిధి ప్రశాంత్‌నగర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ ప్రమాదంతో స్థానికులు ఆందోళ నకు గురయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# హరీష్ రావు, కేటీఆర్ వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారు : మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్)**

అసెంబ్లీ సాక్షిగా బిఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కేటీఆర్ వీధి రౌడీలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.మంగళవారం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వనపర్తి డిసిసి చీఫ్ శివసేనరెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ చౌరస్తాలో భారీ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... అసెంబ్లీ నియమావళికి విరుద్ధంగా నల్ల టీషర్టులతో నిరసన వ్యక్తం చేయడం, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విలువలకు విరుద్ధమని మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ప్రజాస్వామ్యానికి ఆలయంగా భావించే శాసనసభలోనే నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి పక్షానికి నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే సభా గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్‌లపై పార్టీ అధిష్ఠానం తక్షణమే చర్యలు తీసుకుని బర్తరఫ్ చేయాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ నాయకుల తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. పదవులు, రాజకీయ ప్రాబల్యం శాశ్వతం కాదని.. రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు.బీఆర్ఎస్ నేతలకు నిజంగా ప్రజా బలం ఉంటే సభలో గందరగోళం సృష్టించడం, వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకుని ప్రజల్లోకి వచ్చి తమ విధానాలను వివరించాలని సవాల్ విసిరారు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పకుండా మొండిగా వ్యవహరిస్తే గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.రాజ్యాంగ పదవులను, ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచే ఏ ప్రయత్నాన్నీ సహించేది లేదని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ నేతలు తమ తీరును మార్చుకుని ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కాంగ్రెస్ పార్టీ అధికారం ప్రతినిధి కోళ్ల వెంకటేష్,జనార్దన్ సాగర్, పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు జానకిరాము, ద్యారాపోగు శ్రీను, లోకౌన్సిలర్లు పరుశురాం, క్రాంతికుమార్ గౌడ్, పీతంబర్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అత్తం రవి, మండల అధ్యక్షులు వెంకటస్వామి, నరహరి, మాజీ పాకనాటి కృష్ణ, ఎల్ఐసి. కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, శ్రీనివాసు, ఎండీ బాబా,

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు..
# తాత మధుపై కాంగ్రెస్ భగ్గుమంది!

- **స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అవమానం కలిగించేలా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ**
- **దళిత నాయకుడిని స్పీకర్‌గా గౌరవిస్తున్న కాంగ్రెస్.. బీఆర్ఎస్ వైఖరిపై తీవ్ర విమర్శలు**
- **కేసీఆర్ హామీలపై పరశురాం విమర్శలు.. మూడు ఎకరాల భూమి హామీ ఏమైందని ప్రశ్న**



**కీసర, సెప్టెంబర్ 8(సిటీ టైమ్స్):**

తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కీసర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాత మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగానికి లోబడి శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని కించపరిచే చర్యగా వారు అభివర్ణించారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు తాత మధు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని, ఆయనపై చర్యలు తీసుకుని శాసన మండలి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా మాల మహానాడు సంఘం అధ్యక్షుడు గుజ్జుక పరశురాం మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత దళితుడినే తొలి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన కేసీఆర్.. ఆ హామీని అమలు చేయకుండా దళితులను మోసం చేశారని ఆరోపించారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. తాత మధు చేసిన వ్యాఖ్యలకు ఆయనతో పాటు మాజీ సీఎం కేసీఆర్ కూడా దళితులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని పరశురాం డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో దొరల గడీలను బద్దలు కొట్టిన చరిత్ర దళిత, బహుజనులదేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత నాయకుడిని శాసనసభ స్పీకర్‌గా గౌరవిస్తుంటే, బీఆర్ఎస్ నాయకులు ఆ పదవిని కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ పదవులు శాశ్వతం కావని, ప్రజల గౌరవమే శాశ్వతమని పరశురాం పేర్కొన్నారు. దళిత, బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలు కొనసాగితే రాబోయే రోజుల్లో దళిత, బహుజనులు ఏకమై బీఆర్ఎస్ నాయకులకు రాజకీయంగా గట్టి సమాధానం చెబుతారని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామిడి విజయ్‌రెడ్డి, తటకం వెంకటేష్ శర్మ, శివలింగాల శ్రీనివాస్ గౌడ్‌తో పాటు దళిత, బహుజన నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏఐ యుగంలో ఆవిష్కర్తలుగా ఎదగండి

- **యువతే అభివృద్ధి చెందిన భారతానికి చోదకశక్తి**
- **ఓయూ 85వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా**




**హైదరాబాద్, సెప్టెంబర్ 8, (సిటీటైమ్స్):**

ఏఐ, ఆటోమేషన్, డిజిటల్ సాంకేతికత వేగంగా మారుతున్న ప్రస్తుత యుగంలో విద్యార్థులు తమ నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకుని ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తెలంగాణ గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ మానవీయ విలువలను కాపాడుకోవాలని సూచించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవం మంగళవారం ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా అధ్యక్షతన జరిగింది. భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డా. కృష్ణ ఎల్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగారం తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, 1917లో స్థాపించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్య, పరిశోధన, దేశ నిర్మాణంలో విశేష సేవలందిస్తోందన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ విద్య ద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారాలు చూపడంపై విశ్వవిద్యాలయం మరింత దృష్టి సారించాలని సూచించారు.

"ఏఐ సమాచారాన్ని అందించగలదు.. కానీ తుది నిర్ణయం మనిషి తన అవగాహన, నైతిక విలువలు, కరుణ ఆధారంగా తీసుకోవాలి'' అని గవర్నర్ పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం ఉద్యోగార్థులుగా కాకుండా ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామికవేత్తలుగా, సామాజిక సమస్యలకు పరిష్కారాలు చూపే ఆవిష్కర్తలుగా ఎదగాలని కోరారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని సూచించారు. 'మాదకద్రవ్యాలకు నో-జీవితానికి ఎస్' అనే సందేశాన్ని సామాజిక ఉద్యమంగా మార్చడంలో విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి డా. కృష్ణ ఎల్లా మాట్లాడుతూ, విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల త్యాగం ఉందని, వారి కష్టాన్ని గుర్తుంచుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. ఏఐ యుగానికి అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగాల్లో రాణించాలని కోరారు.అనంతరం గవర్నర్ శివప్రతాప్ శుక్లా, డా. కృష్ణ ఎల్లా, ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగారం విద్యార్థులకు పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడళ్లు అందజేశారు.



# శ్రావణ త్రయోదశి సందర్భంగా కీసరగుట్టలో ప్రదోష నందీశ్వర అభిషేకం

- **శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**
- **అభిషేకంలో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ దంపతులు**
- **వేదపండితులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది హాజరు**

**కీసర, సెప్టెంబర్ 8(సిటీ టైమ్స్):**

శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ త్రయోదశిని పురస్కరించుకుని ప్రదోష నందీశ్వర అభిషేకాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ అభిషేక కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, దేవాలయ ఉపప్రధాన రవి శర్మ, వేదపండితులు సత్యనారాయణ శర్మ, అర్చకులు రమేష్ శర్మ, నాగసాయి శర్మ, వెంకటేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# బగ్గీ ఖానాలో నూతన సీసీ రోడ్డు పరిశీలించిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 8, (సిటీటైమ్స్):**

హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బగ్గీ ఖానా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి రోడ్డు పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో స్థానికులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బస్తీవాసులు, స్థానిక నాయకులు మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు.ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు పూర్ణచందర్, బాలకిషన్, నదీమ్, జోసెఫ్, అలీ, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు: గవర్నర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, (సిటీటైమ్స్):**



తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో గవర్నర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు."ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక'' అంటూ తన రచనలతో కోట్లాది ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మృతికి నివాళులర్పిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. ''పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది'' అంటూ కాళోజీ అందించిన స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని పేర్కొన్నారు.''నీ భాషలో నీ బతుకుంది.. నీ యాసలో నీ సంస్కృతి ఉంది'' అని చాటిచెప్పిన కాళోజీ మాటలు అక్షర సత్యాలని గవర్నర్ అన్నారు. ప్రజాకవి కాళోజీ స్ఫూర్తితో తెలంగాణ భాష, యాస, మాతృభాష పరిరక్షణ, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

# రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో అనిరా ఆలివ్స్‌కు స్వర్ణం

**టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్–2026లో మెరిసిన ఏడేళ్ల బాలిక**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8, (సిటీటైమ్స్):**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించిన 'టైకా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2026'లో ఏడేళ్ల బాలిక సంగేపు అనిరా ఆలివ్స్ అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. సెప్టెంబర్ 6న నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో అనిరా ఆలివ్స్ తన నైపుణ్యం, ప్రత్యేక శైలితో ప్రత్యర్థులను అధిగమించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లోనూ రెండు పతకాలు సాధించిన అనిరా, తాజాగా రాష్ట్ర స్థాయిలో స్వర్ణం గెలిచి వరుస విజయాలతో దూసుకుపోతోంది.

ఈ సందర్భంగా కోచ్ కిరణ్ మాట్లాడుతూ, అనిరా చూపుతున్న క్రమశిక్షణ, క్రీడ పట్ల అంకితభావమే ఆమె విజయాలకు కారణమని తెలిపారు. ప్రత్యేక శిక్షణతో ఆమె తన నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుందని, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మరిన్ని పతకాలు సాధించే సత్తా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పోటీల ముగింపు కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, సినీ నటుడు, 8వ డాన్ బ్లాక్ బెల్ట్ డా. సుమన్ తల్వార్, టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు శిహాన్ గ్రాండ్ మాస్టర్ డా. పి. అశోక్ చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు. స్వర్ణ పతకం సాధించిన అనిరా ఆలివ్స్‌ను అతిథులు, క్రీడా ప్రముఖులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.



సిటీటైమ్స్
తెలుగు దినపత్రిక
www.citytimesnews.com
GENERAL NEWS
epaper.citytimesdaily.com

# ఎల్లంపేట మున్సిపాలిటీలో ముదురుతున్న బిల్ కలెక్టర్ల బదిలీల వ్యవహారం

- కౌన్సిలర్లు వర్సెస్ మున్సిపల్ కమిషనర్..
- బిల్ కలెక్టర్ల బదిలీలపై కౌన్సిలర్ల తీవ్ర అభ్యంతరాలు
- ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ఎలా బదిలీ చేస్తారంటూ ప్రశ్నించిన కౌన్సిలర్లు
- మెజార్టీ కౌన్సిలర్ల అభ్యర్థన మేరకే బదిలీలు చేపట్టాం: మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి




**మేడ్చల్ (సిటీ టైమ్స్) సెప్టెంబర్ 8**

ఎల్లంపేట మున్సిపాలిటీలో పలువురి బిల్ కలెక్టర్ల బదిలీల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్ మారింది. కాగా ఈ వివాదం కౌన్సిలర్లు,మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డిల మధ్య విభేదాలకు దారితీస్తున్నట్లు తెలుస్తోంది.కౌన్సిలర్లకు ఎలాంటి ముందస్తు సమాచారం,వారి అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకోకుండానే బిల్ కలెక్టర్లను బదిలీ చేయడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లుగా తెలిసింది.కాగా ఆగస్టు 31వ తేదీన మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి రెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన 12మంది బిల్ కలెక్టర్లను ఒక వార్డు నుండి మరో వార్డుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.కాగా ఇప్పుడు ఇదే అంశం పై మున్సిపల్ కమిషనర్,కౌన్సిలర్ల మధ్య వివాదానికి దారితీసింది.కౌన్సిలర్లకు ఏలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కమిషనర్ ఇష్టానుసారంగా పలువురు బిల్ కలెక్టర్లను బదిలీ చేసినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మున్సిపాలిటీ పాలనలో ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉండగా కమిషనర్ ఇష్టానుసారంగా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని కౌన్సిలర్లు వాపోతున్నారు. ముఖ్యంగా బిల్ కలెక్టర్ల బదిలీ వంటి పరిపాలనా అంశంపై కౌన్సిలర్లకు కనీస సమాచారం,సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండానే బదిలీలపై నిర్ణయం ఎలా తీసుకున్నారని ప్రశ్నలు??**

మున్సిపాలిటీలో కీలకమైన నిర్ణయాలు తీసుకునే ముందు కౌన్సిల్ అభిప్రాయానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్లు వాదిస్తున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా బిల్ కలెక్టర్ల బదిలీకి సంబంధించిన నిర్ణయం తీసుకోవడం వల్ల పాలనలో సమన్వయం దెబ్బతింటుందనే ఆందోళనను పలువురు కౌన్సిలర్లు వ్యక్తం చేస్తున్నారు.

**కమిషనర్ నిర్ణయం పై కౌన్సిలర్ల తీవ్ర అసంతృప్తి**

ముందుగా కౌన్సిలర్లకు సమాచారం ఇచ్చి,అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే బిల్ కలెక్టర్ల బదిలీలపై నిర్ణయం తీసుకుంటే బాగుండేది" అంటూ కొంతమంది కౌన్సిలర్లు కమిషనర్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

**మున్సిపాలిటీ పాలనలో ప్రజాప్రతినిధుల అభిప్రాయానికి విలువ లేదా??**

మున్సిపల్ పాలనలో అధికారులకు ఉన్న పరిపాలనా బాధ్యతలతో పాటు ప్రజాప్రతినిధుల పాత్ర కూడా అంతే కీలకమే.ఈ నేపథ్యంలో కమిషనర్ తన పరిధిలో నిర్ణయాలు తీసుకున్నప్పటికీ..వాటి ప్రభావం మున్సిపల్ పాలన,సిబ్బంది,ప్రజా సేవలపై పడే అంశాల్లో కౌన్సిలర్లతో సమన్వయం అవసరమని పలువురు కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం బిల్ కలెక్టర్ల బదిలీ వ్యవహారం చిన్న పరిపాలనా అంశం నుంచి "కౌన్సిలర్లకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవచ్చా?" అనే పెద్ద ప్రశ్నగా మారుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**వివాదానికి ముగింపు పలుకుతారా?**

బిల్ కలెక్టర్ల బదిలీలపై కౌన్సిలర్లు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను మున్సిపల్ అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.పరిపాలనలో అధికారుల నిర్ణయాధికారం,ప్రజాప్రతినిధుల అభిప్రాయం రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తేనే మున్సిపాలిటీ అభివృద్ధి సజావుగా సాగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.
ఇప్పటికైనా కమిషనర్,కౌన్సిలర్లు పరస్పరం చర్చించుకుని బిల్ కలెక్టర్ల బదిలీ వ్యవహారంపై స్పష్టత ఇవ్వడంతో పాటు.. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు తీసుకునే ముందు కౌన్సిలర్లకు సమాచారం అందించి సమన్వయంతో ముందుకు సాగాలని పలువురు కోరుతున్నారు.మరి బదిలీ వ్యవహారంపై కౌన్సిలర్ల అభ్యంతరాలను అధికారులు పరిగణనలోకి తీసుకుంటారా? లేక కమిషనర్ నిర్ణయమే కొనసాగుతుందా? అనేది వేచి చూడాల్సిందే.
కాగా ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ ఇన్ కృష్ణారెడ్డిని వివరణ కోరగా కౌన్సిల్ సమావేశాల్లో మెజారిటీ కౌన్సిలర్ల అభ్యర్థన మేరకే బదిలీలు చేపట్టడం జరిగింది.ఈ విషయంపై సీపీతో చర్చించిన తర్వాతే బదిలీలు నిర్వహించాం.ఇది నా వ్యక్తిగత నిర్ణయం కాదని మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి సమాధానం ఇచ్చారు.

# హామీలు అడిగితే అక్రమ అరెస్టులా?

- మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి...
- అరెస్టు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను భేషరతుగా విడుదల చేయాలి : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




**వనపర్తి, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):**

అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్యేలు తాత మధు, నవీన్ రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపిస్తూ వారిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు వనపర్తి అంబేద్కర్ చౌరస్తాలో నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మహిళల చేత ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయాలని ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడులు, అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు. నల్ల దుస్తులతో నిరసన తెలిపేందుకు అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను అడ్డుకోవడం, మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అన్నారు.రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లో రాజ్యాంగ పుస్తకాన్ని చేతబట్టి నిరసన తెలిపినప్పుడు లేని అభ్యంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపితే ఎందుకని ప్రశ్నించారు. ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలను సభలో ఎక్కడ బయటపెడుతుందోనన్న భయంతోనే ఎమ్మెల్యేలను సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.రెండుసార్లు మంత్రులుగా పనిచేసిన మహిళా ఎమ్మెల్యేలను అవమానించేలా వ్యవహరించడం దుశ్శాసన పర్వాన్ని తలపిస్తోందని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంతియాజ్ ఇసాక్ మాట్లాడుతూ మహిళా పక్షపాతి అని చెప్పుకునే రేవంత్ రెడ్డి మహిళల ఆగ్రహానికి గురై రాజకీయంగా పతనం కావడం ఖాయమని అన్నారు. ప్రజల నుంచి వస్తున్న నిరసనలను తట్టుకోలేక ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు.మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

# రావల్ కోల్ లో పరదాల చాటున ప్రభుత్వ పాఠశాల నిర్వహణ:పట్టింపులేని అధికారులు

- క్రషర్ల దుమ్ముతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అవస్థలు
- ప్రతినిత్యం వందలాది టిప్పర్ల రాకపోకలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్



**మేడ్చల్ (సిటీ టైమ్స్) సెప్టెంబర్ 08**

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని రావల్ కోల్ లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు దుమ్ము, ధూళి మరియు ప్రతినిత్యం భారీ వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు పక్కనున్న రోడ్డు పై నుండి ప్రతినిత్యం పలు క్రషర్ల నుండి వందలాది టిప్పర్లు రాకపోకలు సాగిస్తుండటంతో పాఠశాల పరిసరాల్లో దుమ్ము,ధూళి పేరుకుపోతోందని వారు వాపోతున్నారు.ప్రతిరోజూ సుమారు 350 నుంచి 500 టిప్పర్ వాహనాలు ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తుండటంతో దుమ్ము, ధూళి పాఠశాల ఆవరణలోకి చేరుతోంది.దీంతో తరగతి గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మధ్యాహ్న భోజనం సైతం ప్రశాంతంగా కూర్చొని తినలేని దుస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
పాఠశాల చుట్టూ గ్రిల్స్,గ్రీన్ మ్యాట్ వేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేని వైనం
దుమ్ము ప్రభావాన్ని తగ్గించేందుకు దాతల సహకారంతో పాఠశాల చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేసి గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు.భారీ వాహనాలు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండటంతో రహదారిపై ప్రమాద భయం కూడా నెలకొంటోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాకుండా టిప్పర్ వాహనాల రాకపోకల సమయంలో వచ్చే శబ్దాల కారణంగా తరగతి గదుల్లో పాఠాలు సరిగా వినిపించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.పాఠశాలకు వెళ్లే సమయంలో కూడా భారీ వాహనాల కారణంగా భయపడాల్సి వస్తోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. విద్యార్థుల భద్రత,ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల పరిసరాల్లో దుమ్ము నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు,భారీ వాహనాల వేగం, ఓవర్‌లోడింగ్, రాకపోకలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాల సమీపంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుని విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి...
- వనపర్తి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ద్యారపోగు వెంకటేష్ డిమాండ్...

**వనపర్తి, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):**



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వనపర్తి జిల్లా ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ద్యారపోగు వెంకటేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్‌ను అవమానించడం అంటే కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, రాజ్యాంగ పదవితో పాటు శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని అన్నారు. ఎమ్మెల్సీ స్థాయిలో ఉన్న వ్యక్తి హోదాకు తగని విధంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దళిత నాయకులను గౌరవిస్తున్నామని చెప్పడం మాత్రమే కాకుండా, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న దళిత నాయకుల గౌరవాన్ని కాపాడే సంస్కారాన్ని చేతల్లో చూపించాలని వెంకటేష్ డిమాండ్ చేశారు. రాజకీయ హోదాను అడ్డుపెట్టుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఉపేక్షిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు తప్పుడు సంకేతం వెళ్తుందని అన్నారు.తాతా మధుపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని స్పీకర్ గౌరవంతో పాటు శాసనసభ ప్రతిష్ఠను కాపాడాలని ద్యారపోగు వెంకటేష్ డిమాండ్ చేశారు.



# కనిమెట్టలో ఘనంగా పోచమ్మ పండుగ ఉత్సవాలు

**కొత్తకోట సిటీటైమ్స్ సెప్టెంబర్ 8:**

కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామంలో పోచమ్మ పండుగ ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బోనాలు, బీరప్పడోలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామచంద్ర యాదవ్, ఉపసర్పంచ్ జయరాములు, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజు, వార్డు సభ్యులు మద్ద బుచ్చమ్మ, నరుకుల కురుమూర్తి, అంజన్న, రామ యాదవ్తో పాటు వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# అకాల మృతుల కుటుంబాలను పరామర్శించిన: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, సెప్టెంబర్ 8 (సిటీటైమ్స్):**

వనపర్తి పట్టణంలో ఇటీవల అకాల మరణం చెందిన పలువురి కుటుంబాలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.పట్టణంలోని 1వ వార్డు రాయిగడ్డకు చెందిన గౌడుగు నాగరత్నమ్మ మృతి చెందడంతో ఆమె నివాసానికి వెళ్లిన నిరంజన్ రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అదేవిధంగా 31వ వార్డు బసవన్నగడ్డకు చెందిన హోంగార్డు నేమకల కిరణ్ కుమార్ గౌడ్ మృతికి సంతాపం తెలిపి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.17వ వార్డుకు చెందిన గఫార్ మృతి విషయం తెలుసుకున్న నిరంజన్ రెడ్డి వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ పరామర్శ కార్యక్రమాల్లో టీఎస్ఎంఎఫ్‌సీ ఇంతియాజ్, మాజీ కౌన్సిలర్ వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, గంధం పరంజ్యోతి, లక్ష్మీనారాయణ, ప్రేమ్‌నాథ్ రెడ్డి, స్టార్ రహీం, జోహేబ్ హుస్సేన్, ఇమ్రాన్, జాంగిర్, చిట్యాల రాము, మంద రాము, ఆరిఫ్, పాషా, యూసుఫ్ ఖాదర్, లక్ష్మణ్ గౌడ్, శివ గౌడ్, మునికుమార్, సోహైల్, సాదిక్, ఆసాద్, ఇంతియాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ హామీల అమలుకు డిమాండ్ చేస్తూ పంజాగుట్టలో వినతిపత్రం

**పంజాగుట్ట, సెప్టెంబర్ 8, (సిటీటైమ్స్):**

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు పంజాగుట్టలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఈ సందర్భంగా మహేష్ యాదవ్ డిమాండ్ చేశారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో సోమాజిగూడ డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భారత సరిహద్దుల వెలుపల అరుణాచల్, ఆక్సాయ్ చిన్

**న్యూఢిల్లీ, సిటీ టైమ్స్**

ఐక్యరాజ్యసమితి ఇటీవల విడుదల చేసిన ప్రపంచ పటం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సాధారణ సభలో ఆఫ్రికన్ యూనియన్ నేతృత్వంలో ప్రవేశపెట్టిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానానికి భారత్ మద్దతు తెలిపినప్పటికీ.. మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాలను భారత్‌చైనాల సరిహద్దు వెలుపల ప్రాంతాలుగా చూపడం కలకలం రేపుతోంది. ఈ మ్యాప్‌ను జులై 1న మొదటిసారి ఐరాస చర్చల సమయంలో ప్రచురించారు. ఇందులో అరుణాచల్ ప్రదేశ్‌కు నాగాలాండ్‌తో ఉన్న సరిహద్దును తొలగించి, దాన్ని అస్సాం , చైనాల మధ్య ఉన్న ఒక ప్రత్యేక ప్రాంతంగా చూపించారు.

అదేవిధంగా అక్సాయ్ చిన్‌ను కూడా ప్రత్యేక ప్రాంతంగా చూపిస్తూ.. దాని పశ్చిమాన భారత్, తూర్పున చైనా సరిహద్దులను గుర్తించారు. అయితే, ఈ మార్పులకు గల కారణాలను ఐక్యరాజ్యసమితి వెల్లడించలేదు. అలాగే, జమ్మూ కశ్మీర్‌ను భారత్, పాకిస్థాన్‌ల మధ్య విభజించే నియంత్రణ రేఖను చుక్కల గీతతో సూచించారు. అయితే మ్యాప్ కింద ఇచ్చిన వివరణలో 'ఈ చుక్కల గీత భారత్‌పాకిస్థాన్‌లు అంగీకరించిన నియంత్రణ రేఖను దాదాపుగా సూచిస్తుంది' అని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ అంశంపై ఇరు వర్గాల మధ్య ఇంకా పూర్తి ఒప్పందం కుదరలేదు' అని ఐరాస అందులో తెలిపింది.



**కొత్త పటాన్ని ఆమోదించిన ఐరాస**

ప్రపంచ ప్రాంతాలను, ముఖ్యంగా ఆఫ్రికా ఖండాన్ని భౌగోళికంగా మరింత ఖచ్చితత్వంతో, సరిసమాన నిష్పత్తిలో చూపించాలని ఆఫ్రికా యూనియన్ ప్రతిపాదించిన 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఐరాస సాధారణ సభ ఇటీవల ఆమోదించింది. ఈ పటం ఏ దేశంపైనా చట్టబద్ధమైన కట్టుబాట్లను విధించనప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ సంస్థలు దీనిని ప్రామాణిక పటంగా స్వీకరించే అవకాశం ఉంది.

భారత స్పందన

ఆఫ్రికా గ్రూప్ తరఫున టోగో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి భారత్ మద్దతుగా ఓటు వేసింది. అయితే, 'ఖండాలు, దేశాల భూభాగాల వైశాల్యాన్ని సమాన నిష్పత్తిలో ప్రదర్శించే సూత్రానికి మాత్రమే భారత్ మద్దతు ఇచ్చింది'' అని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ''ఈ తీర్మానానికి మద్దతు ఇవ్వడం అంటే ఐరాస రూపకల్పన చేసిన నిర్దిష్ట పటానికి గానీ, సరిహద్దుల గుర్తింపునకు గానీ ఆమోదం తెలిపినట్లు కాదు'' అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

''జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలతో సహా భారతదేశ సార్వభౌమత్వ పరిధిలోని ప్రాంతాలన్నీ భారత అధికారిక పటం ప్రకారమే చూపించాలి.. ఎలాంటి తప్పుడు లేదా గందరగోళ ప్రదర్శనలను ఒప్పుకునేది లేదు. భారత సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రత విషయంలో మా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉంటుంది... ఇందులో ఎలాంటి సర్దుబాట్లకు తావులేదు'' అని భారత ప్రభుత్వం తేల్చిచెప్పింది.

అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్‌లను సరిహద్దు బయట చూపడంపై భారత్ ఇంకా అధికారికంగా స్పందించలేదు. అక్సాయ్ చిన్‌తో సహా జమ్మూ కశ్మీర్, లడఖ్ మొత్తం ప్రాంతం భారతదేశంలో అంతర్భాగమని, ఎల్లప్పుడూ భారతదేశానికి చెందినదేనని భారత్ మొదటి నుంచీ స్పష్టం చేస్తోంది. అలాగే అరుణాచల్ ప్రదేశ్ కూడా భారత్‌లో అంతర్భాగమని న్యూఢిల్లీ మరోసారి పునరుద్ఘాటించింది.




# సామాజిక బాధ్యత చాటుకున్న లోయోలా కళాశాల విద్యార్థులు

**మేడ్చల్ (సిటీ టైమ్స్) సెప్టెంబర్ 8:**

లోయోలా అకాడమీ ఆధ్వర్యంలో డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న 'ప్లానెట్' సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వాణిజ్య విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం బాచుపల్లిలోని డిజైర్ సొసైటీలో సేవా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీ,ఎయిడ్స్‌తో జీవిస్తున్న చిన్నారులను కలిసి వారికి ఆప్యాయత,ప్రోత్సాహం మద్దతు అందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ఫాదర్ బి.పీటర్,ఫాదర్ అనిల్ కుమార్,కరస్పాండెంట్ ఫాదర్ ఎ.రెక్స్ ఏంజెలియో, ఫాదర్ డాక్టర్ ఎన్.బి.బాబు మార్గదర్శకత్వంలో,విస్తరణ కార్యక్రమాల అధికారి స్టీఫెన్ ఆశీర్వాదం సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ నీలిమ,ప్రాజెక్టు అధిపతి వెంకటేష్ విద్యార్థులకు హెచ్‌ఐవీ,ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి,లక్షణాలు,నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.అలాగే వ్యాధితో జీవిస్తున్న వారిపై సమాజంలో ఉన్న అపోహలు,వివక్షను తొలగించాల్సిన అవసరాన్ని వివరించారు.అనంతరం విద్యార్థులు చిన్నారులతో ఆత్మీయంగా మమేకమై ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత,సంరక్షణ,శారీరక శుభ్రత,విద్య వంటి అంశాలపై ప్రోత్సాహం,మార్గదర్శకత్వం అందించారు.చిన్నారులతో గడిపిన సమయం విద్యార్థుల్లో సానుభూతి,మానవతా దృక్పథం, సామాజిక బాధ్యతను మరింత పెంపొందించింది. భవిష్యత్తులోనూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌తో జీవిస్తున్న చిన్నారులకు అండగా నిలుస్తామని విద్యార్థులు తెలిపారు.

# మైక్ ఇస్తే క్షమాపణ చెబుతారనుకున్నా

**హైదరాబాద్, సిటీ టైమ్స్**

తెలంగాణ శాసనసభలో చోటుచేసుకుంటున్న పరిణామాలు , ప్రతిపక్ష పార్టీల వైఖరిపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో విలేకరులతో జరిగిన ప్రత్యేక చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ సభా నిర్వహణ, క్రమశిక్షణ , సభ్యుల ప్రవర్తనపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.



**మైక్ ఇస్తే క్షమాపణ చెబుతారనుకున్నా**

నిన్న శాసనసభలో జరిగిన అనూహ్య ఘటనలపై ప్రతిపక్ష సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారని భావించినట్లు స్పీకర్ తెలిపారు. వాస్తవానికి నిబంధనల ప్రకారం మైక్ ఇచ్చే వెసులుబాటు లేకపోయినా, ప్రజాస్వామ్యబద్ధంగా ఆలోచించి నాలుగు వైపులా గమనిస్తూ అవకాశం కల్పించానని పేర్కొన్నారు. హరీష్ రావుకు మైక్ ఇస్తే నిన్నటి వ్యవహారంపై సభకు క్షమాపణ చెబుతారని ఆశించానని, కానీ వారు అంశాన్ని పక్కదోవ పట్టించే (డైవర్షన్) ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు సభలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న హరీష్ రావు కనీసం స్పందించకపోవడం సరికాదని, అటువంటి ప్రవర్తన వల్లనే తాను సభలో తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.

**చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంది**

అసెంబ్లీ వెలుపల జరిగే ఘటనలు స్పీకర్ పరిధిలోకి రావనే వాదనను గడ్డం ప్రసాద్ తోసిపుచ్చారు. పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ప్రాంగణం అంతా స్పీకర్ పరిధి కిందకే వస్తుందని తెలిపారు. నిబంధనలను అతిక్రమించినందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఇద్దరు ఎమ్మెల్సీలను తక్షణమే సస్పెండ్ చేసి బయటకు పంపే అధికారం తనకు ఉందని, అయితే కాంగ్రెస్ పార్టీ విధానం , ప్రజాస్వామ్య సాంప్రదాయాల ప్రకారం అలా త్వరితగతిన చర్యలు తీసుకోలేదని వివరించారు. సభను నడిపించడానికి గతంలో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన సభ నిబంధనలనే తాము ప్రస్తుతం అమలు చేస్తున్నామని గుర్తుచేశారు.

**పోలీసులపై దాడి, మహిళా ఎమ్మెల్యేల ఇష్యూపై తీవ్ర ఆగ్రహం**

ఇటీవల జరిగిన ఘటనల్లో కేటీఆర్, కౌశిక్ రెడ్డిలు పోలీసులను కొట్టిన దృశ్యాలు బయటకు వచ్చాయని స్పీకర్ ప్రస్తావించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన అనుచిత ప్రవర్తనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తీవ్ర సీరియస్‌గా ఉన్నారని తెలిపారు. ఈ ఘటనలన్నింటిపై సమగ్ర నివేదిక తెప్పించుకుని తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**కేసీఆర్‌కు ఫోన్ చేసి ఆహ్వానించా**

సభ ప్రారంభానికి ముందు ప్రతిపక్ష ఎల్పీ నేతలకు ఫోన్ చేసి మాట్లాడే సంప్రదాయంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు స్వయంగా ఫోన్ చేసినట్లు స్పీకర్ వెల్లడించారు. సభకు హాజరుకావాలని ఆయనను కోరగా, ప్రస్తుతం తన ఆరోగ్యం సహకరించడం లేదని కేసీఆర్ తెలిపారని స్పీకర్ గడ్డం ప్రసాద్ వెల్లడించారు. సభలో సజావుగా చర్చలు జరగాలన్నదే తన తుది లక్ష్యమని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 1000 రోజులు.. హామీలు ఎక్కడ?

**హైదరాబాద్, సిటీటైమ్స్**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చ జరగకుండా ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి?

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని హరీశ్ రావు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు అన్నారు. కరెంటు కొరత, సాగునీరు అందక పంటలు ఎండిపోవడం వంటి సమస్యలతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతుల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించి, వారికి అవసరమైన సాయం అందించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన

ఫీజు రీయింబర్స్మెంట్ సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు అన్నారు. మరోవైపు హామీ ఇచ్చిన స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ నెలకొందని పేర్కొన్నారు. యువత సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కారని ఆరోపిస్తూ.. బాధితులపైనే కేసులు పెట్టడం అప్రజాస్వామికమని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల ఇలాంటి వ్యవహారశైలి సరికాదని అన్నారు.

ప్రజా సమస్యలపై చర్చించకుండా ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని హరీశ్ రావు ఆరోపించారు. అసెంబ్లీని రాజకీయ విమర్శలకు వేదికగా కాకుండా ప్రజా సమస్యలపై చర్చించే వేదికగా ఉపయోగించాలని ఆయన డిమాండ్ చేశారు.



# పోలీస్ ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

**హైదరాబాద్, సిటీటైమ్స్**

తెలంగాణ రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న వేలాది మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల విజ్ఞప్తులు దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(TSLPRB) విడుదల చేసిన నూతన ప్రకటన ప్రకారం, అభ్యర్థులు సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. నియామక ప్రకటన ప్రకారం తొలుత సెప్టెంబర్ 9వ తేదీని చివరి తేదీగా నిర్ణయించినప్పటికీ, తాజాగా ఆ గడువును మరో వారం రోజుల పాటు పొడిగించారు.

టీఎస్ఎల్ఆర్బీ జులై 29న విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 7,437 పోస్టులను భర్తీ చేయనుంది. ఖాళీల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

పోలీస్ కానిస్టేబుల్ (సివిల్): 3,697 పోస్టులు

పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్ ): 1,052 పోస్టులు

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్: 1,380 పోస్టులు

ఫైర్ ఫైటర్ (తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ & ఫైర్ సర్వీసెస్): 751 పోస్టులు

జైలు వార్డర్ (తెలంగాణ జైళ్ల శాఖ): 208 పోస్టులు

పోలీస్ కానిస్టేబుల్ (పురుషులు): 24 పోస్టులు

పోలీసు నియామక ప్రక్రియకు అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం.. మొత్తం 3,38,336 మంది అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ప్రాథమిక రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారు. వీరిలో 2,88,530 మంది నిర్ణీత ఫీజు చెల్లించి, దరఖాస్తు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. నియామక ప్రక్రియలో పారదర్శకత కోసం నిర్వహిస్తున్న ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ ఇప్పటికే 95 శాతానికి పైగా పూర్తయినట్లు రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది.




గడువు పెరిగినప్పటికీ, అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడవద్దని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అలర్ట్ చేసింది. చివరి రోజుల్లో సర్వర్లపై తీవ్ర ఒత్తిడి పెరిగి సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, అర్హత కలిగిన అభ్యర్థులు వీలైనంత త్వరగా తమ దరఖాస్తు ప్రక్రియను, ఫీజు చెల్లింపును పూర్తి చేసుకోవాలని సూచించింది. అభ్యర్థులు మరింత సమాచారం, ఆన్‌లైన్ దరఖాస్తు కోసం అధికారిక వెబ్‌సైట్ tslprb.in ను సందర్శించవచ్చు.

సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి పోస్టులకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750, ఇతర అభ్యర్థులందరికీ (ఓసీ/బీసీ) రూ.1,500గా ఫీజు ఉంది. పోలీస్ కానిస్టేబుల్, ఫైర్ ఫైటర్, జైలు వార్డెన్ పోస్టులు అప్లై చేసే తెలంగాణ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600, ఇతర అభ్యర్థులందరికీ రూ.1,200గా ఫీజు నిర్ణయించారు.

ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ ఒక్కసారి మాత్రమే నిర్వహిస్తారు. ఆ పరీక్ష ఫలితాలనే వారు దరఖాస్తు చేసుకున్న అన్ని పోస్టులకూ పరిగణనలోకి తీసుకుంటారు.

# కేటీఆర్ అరెస్ట్

**హైదరాబాద్, సిటీటైమ్స్**

హైదరాబాద్ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావుతో పాటు పలువురు ఆ పార్టీ ముఖ్య నేతలను పోలీసులు అరెస్ట్ చేసి నగరంలోని వేర్వేరు పోలీస్ స్టేషన్లకు తరలించిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని తీవ్ర ఆందోళన చేపట్టారు. ఇదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. రెండు పార్టీలకు చెందిన కార్యకర్తలు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొద్దిసేపటికి వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది.

పరిస్థితి అదుపు తప్పడంతో కొందరు కార్యకర్తలు కుర్చీలు, రాళ్లు విసురుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ పార్టీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఆందోళన కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ కార్యకర్తలు ముందుకు రావడంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకోగా, పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. రాళ్లు, కుర్చీలతో పరస్పరం దాడులు జరిగినట్లు ప్రత్యక్షంగా ఉన్నవారు చెబుతున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు తెలుస్తోంది. ఘర్షణలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైందని.. చేయి విరిగినట్లు సమాచారం. అయితే గాయాలపై పూర్తి వివరాలు, ఘటనకు సంబంధించిన కారణాలపై అధికారికంగా పూర్తి సమాచారం వెలువడాల్సి ఉంది.

పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. అతి కష్టం మీద ఇరు వర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. ఈ ఘటనల నేపథ్యంలో బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ సహా బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్ స్టేషన్ల పరిసరాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. తమ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ నేతలకు కూడా రక్షణ లేకుండా పోయిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

Printed by Published by SHANKARI SHIVA KUMAR on behalf of SHANKARI SHIVA KUMAR, published at H. NO. 290/1/A, LINGAN PALLY, NEAR GOVT SCHOOL, GOPANPALLY, SERILINGAMPALLY RANGAREDDY TELANGANA 500046, Printed by KAMATHAM SATEESH KUMAR , at SATISH GRAPHICS, 18456/1, NEAR VENKATESWARASWAMY TEMPLE, CHIKKADAPALLY, HYDERABAD, TELANGANA – 500020. Editor SHANKARI SHIVA KUMAR. Chief Editor: N.RamaKrishna Reddy. Phone: 9912074220, 9704616666 Mail: citytimesdaily.com.